www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 15 సంచిక : 120 ఆదివారం, జనవరి 25, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400



## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

### 27న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు

**న్యూఢిల్లీ,జనవరి 24 :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని పరభుత్వం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాలకు ముందు సంప్రదాయం ప్రకారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా2లో...

## సింగరేణిపై దుష్ప్రచారం...

# కట్టుకథలు



- సింగరేణిపై దుష్ప్రచారం...కట్టుకథలు
- సైట్ విజిట్ నిబంధన గతంలో ఉన్నదే
- ఎవరి ప్రయోజనం కోసం..ఎవరు చేస్తున్నారు
- ఒకరు కథనం..మరోకరు లేఖ...ఇంకొకరు విచారణ
- వీరికి ఉన్న సబంధం ఏమిటో ప్రజలకు తెలియాలి
- సింగరేణిపై కిషన్ రెడ్డి విచారణను స్వాగతిస్తున్నాం
- అన్ని వ్యవహారాలపై విచారణ జరగాలన్నదే తన అభిప్రాయం
- మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి

**హైదరాబాద్,జనవరి24:** హైదరాబాద్, జనవరి 24: సింగరేణి పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు రాతలు రాస్తున్నారని, ఈ నినాదాల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? అంటూ ప్రశ్నలు సంధించారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు మోపుతూ, కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని డిప్యూటీ సీఎం ఆగ్రహించారు. శనివారం నాడు ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిపై కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 'ఒకరు కథనం రాశారు, మరొకరు లేఖ రాశారు, ఇంకొకరు విచారణకు ఆదేశించారు, ఈ ముగ్గురికీ ఉన్న సంబంధం ఏంటి' అని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. సింగరేణి అటానమస్ సంస్థ అని, అన్ని నిర్ణయాలు వారే తీసుకుంటారని భట్టి తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రావడం, విచారణ జరిపించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. సింగరేణిలో తాను వచ్చాకే సైట్ విజిట్ నిబంధన వచ్చిందని ప్రచారం చేస్తున్నారని, నిజాలు బయటకు రావాలని, ప్రజలకు తెలియాలని చెప్పుకొచ్చారు. 2018లోనే సైట్ విజిట్ నిబంధనను కోల్ ఇండియా తీసుకొచ్చిందని, 2021లో ఎన్ఎమ్‌డీసీ కూడా అమలు చేసిందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 2023లో సింగరేణిలోనూ సైట్ విజిట్ కండీషన్ అమల్లోకి వచ్చిందని, సీఎమ్‌పీడీఐ డాక్యుమెంట్‌లో సైట్ విజిట్ తప్పనిసరని ఉందని చెప్పారు. 2018, 2021లో డిప్యూటీ సీఎం భట్టి లేదని, కాంగ్రెస్ లేదని ఆయన గుర్తు చేశారు. దేశంలోని పలు కేంద్ర, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ అమలు చేస్తున్నాయన్నారు. రైల్వే, హిందుస్థాన్ కాపర్స్, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్ కంపెనీ, మహారాష్ట్ర ప్రభుత్వ టెండర్లలోనూ ఈ నిబంధన ఉందని భట్టి పేర్కొన్నారు. సైట్ విజిట్ ఎక్కడా లేదన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దురుద్దేశంతో రాసిన ఓ కథనం ఆధారంగా ఒక నేత లేఖ రాశారని, అపోహలు పెరుగుతాయని వెంటనే టెండర్లు రద్దు చేశామని భట్టి తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లకు బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారని, దేశంలో ఏ మైనింగ్ యాక్టివిటీలోనూ డీజిల్ సప్లయ్ చేసే పరిస్థితి లేదని చెప్పారు. 2022లో నైనీ బ్లాక్ టెండర్లలో డీజిల్ విధానం మార్చారని వెల్లడించారు. సింగరేణి 25 టెండర్లలో 20 బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 5 టెండర్లే జరిగాయని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు సంబంధించిన ఎవరికీ టెండర్లు రాలేదని అన్నారు. సృజన్‌రెడ్డితో సీఎంకు సంబంధాలున్నాయన్న వార్తల్లో నిజం లేదన్నారు. సృజన్‌రెడ్డి కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అని, ఎండీ దీప్తి రెడ్డి కందాల కూతురు అని, మిగతా2లో...

## యధాతథంగా టీహబ్ కార్యాలయం

### ప్రభుత్వ కార్యాలయాల మార్పవద్దన్న సిఎం

### అమెరికా నుంచి సిఎస్‌కు రేవంత్ ఆదేశాలు




## బండి,ధర్మపురిలకు కెటిఆర్ లీగల్ నోటీసులు

### - పరువు తీసినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్




## దేశవ్యాప్తంగా 18వ రోజ్‌గార్ మేళా



- 61,000 మందికి నియామక పత్రాలు అందించిన మోడీ

**హైదరాబాద్,జనవరి 24 :** దేశవ్యాప్తంగా శనివారం జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశ వ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రిత్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా మిగతా2లో...

## సింగరేణపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- కాంగ్రెస్, బిఆర్ఎస్ ఇద్దరూ దోపిడీ దారులే
- "ఉమ్మడి" ఎపిని మించి సింగరేణి గనుల దోపిడీ
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్,జనవరి 24 :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నాయని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన.. మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. 2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే.. గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారని మిగతా2లో...




### టెండర్లు రద్దు చేయడమంటే..

## అవినీతి జరిగినట్లే...

- అసలు విషయాలు భట్టి ఎందుకు దాస్తున్నారు
- సిఎం రేవంత్ బావమరిది విషయంలోనూ దాపరికాలు
- ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు

## నైనీ బ్లాక్ టెండర్లపై విచారణ

### - రంగంలోకి దిగిన ఇద్దరు కేంద్ర బృందం సభ్యులు




## సొంత చెల్లెలే ఫోన్ ట్యాప్ బారిన పడ్డారు

- కవిత ఆరోపణలకు సమాధానం చెప్పాలి
- కెటిఆర్ తీరుపై మండిపడ్డ మహేశ్ గౌడ్



**హైదరాబాద్,జనవరి 24 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేస్తున్న విమర్శలపై పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటు గా స్పందించారు. వ్యక్తిగత హననం జరుగుతోందని కెటిఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిధిలోనే విచారణ సాగు తోందని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు ఉండేవని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కెటిఆర్ ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇద్దరి మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని అన్నారు. కెటిఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. కెసిఆర్ కుటుంబం అలీబాబా 420 దొంగల మాదిరిగా దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ తీవ్రవిమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్ స్టువర్ట్ పురం దొంగల బ్యాచా మారిందన్నారు. ఆరనీకుమా ఈకార్తీకదీపం అనే ముందు, మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ దీపం మిగతా2లో...

## సింగరేణిపై దుష్ప్రచారం...కట్టుకథలు

(మొదటి పేజీ తరువాయి)

సృజన్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అల్లుడని భట్టి వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అసలు ఏం కావాలని, కేంద్రానికి ఎందుకు లేఖలు రాస్తున్నారని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని టెండర్లపై విచారణ జరపాలని తనకు లేఖ రాయాలన్నారు. తాడిచర్ల నుంచి నైనీ వరకు అన్నింటిపై దర్యాప్తు చేద్దామని అన్నారు. సీఎం రేవంత్ రాగానే చర్చించి విచారణకు ఆదేశిస్తామని చెప్పారు. తాను ఆస్తులు కూడబెట్టుకోవడానికి రాజకీయాల్లో రాలేదని, బొగ్గు బావుల్లో ఏ రాబందులను వాలనివ్వనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగితే.. 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని మంత్రి వివరించారు. తెలంగాణ కు ఆత్మ సింగరేణి అని అన్నారు. అలాంటి సింగరేణిపై కట్టుకథలు.. కొన్ని లేఖలు.. కొన్ని రివ్యూ లు వచ్చాయని మండిపడ్డారు. 42 వేల మంది సింగరేణి ఉద్యోగుల.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 20 వేల మంది నీ మానసికంగా దెబ్బతీసేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా పెట్టుబడులు రాకుండా.. కట్టుకథల విషపు రాతలు.. తొలిపలుకు రాతలు.. తప్పుడు ప్రచారం.. రాష్ట్ర ప్రభుత్వం పై కావాలని కథనాలు రాస్తున్నారు. రోజుకో కథ వండి వారిస్తున్నారని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యంగా సింగరేణికి సంబంధించిన ఆస్తుల్ని కాపాడాల్సినటువంటి వ్యక్తిగా వీటన్నింటిని చూస్తూ ఉంటే ఏ రాబందులు ఏ గద్దలు ఏ దోపిడి దారుల ప్రయోజనాల కోసమో ఈ కథనాలన్నీ వస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు. ఇటువంటి రాతలతో తెలంగాణకు సంబంధించినటువంటి అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ పైన నిందలు మోపే క్రమంలో ఈ రాష్ట్రానికి సింగరేణికి నష్టం చేస్తున్నారన్న సంగతి మర్చిపోవద్దని గుర్తు చేశారు.

## సిఎం రేవంత్‌పై కెటిఆర్ అనుచిత భాష

**మతితప్పి మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేత**

**మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటుతామన్న పొంగులేటి**

**హైదరాబాద్,జనవరి 24 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన కేటీఆర్ మాట్లాడుతున్న భాష సరిగా లేదని మతి లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి మీడియా సమవేశంలో విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు వ్యక్తిగతంగా తాను రిఫరెండంగా భావిస్తున్నానని అన్నారు. ఇప్పటికే రెండుసార్లు కేటీఆర్ రిఫరెండం అన్నారు. మళ్లీ ఇప్పుడు రిఫరెండం అంటున్నారు. ఇంతకు ముందు జరిగిందే ఈ ఎన్నికల్లో జరుగుతుంది. ఆనాడు సోయి లేకుండా ఇష్టం వచ్చినట్లు జిల్లాలను ఏర్పాటు చేసి ఇప్పుడు అగ్నిగుండం చేస్తామని మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా శాస్త్రీయ పద్దతిలో ప్రజామోదంతో జిల్లాలను పునర్ వ్యవస్థీకరిస్తామన్నారు. బట్టకాల్చి మీద వేయడమే ప్రతిపక్ష పార్టీ పని అన్నట్లుగా ప్రధాన ప్రతిపక్షం వ్యవహరిస్తోంది. మా రెండేళ్ల పాలనలో ఏ తప్పు జరిగిందని మాట్లాడుతున్నారు. వారి పాలనలో అక్రమాలు జరిగినట్లుగానే ఇప్పుడు కూడా అలాగే జరుగుతున్నాయని భ్రమపడుతున్నారు. ఇంకా అధికారంలో ఉన్నట్లుగా వారి వ్యవహార శైలిఉంది. అధికారంలోకి వస్తామని పగటికలలు కంటున్నారు. ఒక్కో అవినీతి బయటకు వస్తోందని అన్నారు. ధరణి పోర్టల్ ద్వారా భూములు కబ్జా చేసిన వారిని, రిజిస్ట్రేషన్ చలానా సొమ్ము కాజేసిన వారిని వదిలేది లేదని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. పోర్టల్‌ను అడ్డం పెట్టుకొని గత ప్రభుత్వంలోని పెద్దలు భూములు కాజేశారు. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాం. కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాం. అనేక అవినీతి, అక్రమాలు జరిగినట్టు నివేదికలో స్పష్టమైందని మంత్రి అననారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి 35 వేల లావాదేవీలు జరిగాయి. 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించాం. 9 జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు. ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా నిర్వహిస్తాం అని మంత్రి పొంగులేటి తెలిపారు.

## సింగరేణపై శ్వేతపత్రం విడుదల చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే.. బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెబుతున్నారని ప్రస్తావించారు. సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని ఆరోపించారు. సింగరేణిపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో టైంపాస్ చేయొద్దని బండి అన్నారు. సింగరేణి అవకతవకలకు సంబంధి చిన రికార్డులన్నీ వెంటనే సీజ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో అవి తారుమారు చేసే ప్రమాదముందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని బండి సంజయ్ విమర్శించారు. ఆ సొమ్ముతోనే బీఆర్ఎస్‌ను ఇన్నాళ్లూ నడిపించారని ఆరోపించారు. 'రూ.42 వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంది. సింగరేణిని అప్పుల పాల్జేసింది. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మునంతా దారి మళ్లించడం పరిపాటైంది. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలే. మా బాగోతం మీరు బయటపెడితే.. మీ బాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారు. కేటీఆర్ పెద్ద నిజాయతీపరుడిలా మాట్లాడుతున్నారు. ఎన్ని కుటుంబాలను, ఎంత మంది జీవితాలను నాశనం చేశారో తెలియదా? నిజామ్ అరాచకాలను మరువలేదు.. నీ అరాచకాలను కూడా మర్చిపోలేం. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్.. నా ఛాలెంజ్‌కు సిద్ధమా? దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే దమ్ముందా? మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతో పాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నంబర్లను చేర్చింది నిజం కాదా? ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా? ఇంకా సిగ్గులేకుండా దేశ భద్రత కోసం ఫోన్ ట్యాపింగ్ చేశామని చెబుతారా? నేను సవాల్ విసిరితే లీగల్ నోటీసులంటూ డ్రామాలాడతారు. పోనీ ఆ లీగల్ నోటీసులకైనా కట్టుబడి ముందుకు సాగుతారా? అంటే.. మధ్యలోనే పారిపోతారు' అని కేంద్ర మంత్రి ఎద్దేవా చేశారు. 'రోహింగ్యాలు 2014కు ముందే పాతబస్తీలోకి అక్రమంగా ప్రవేశించారు. వారికి రేషన్ కార్డులు, ఓటర్ కార్డులిచ్చింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులే. బీఆర్ఎస్ పాలనలో నాటి హోంమంత్రి.. వారికి ఇళ్లు మంజూరు చేసి మద్దతిచ్చారు. రాష్ట్ర పాలకులే ఓటు బ్యాంకు కోసం రోహింగ్యాలకు వంతపాడుతుంటే.. శాంతిభద్రతలను కాపాడేదెవరని బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు.

## టెండర్లు రద్దు చేయడమంటే..అవినీతి జరిగినట్లే...

**హైదరాబాద్,జనవరి 24:** బొగ్గు కుంభకోణం విషయంలో అవినీతి ఆరోపణలు రావ డంతో నైనీ టెండర్ రద్దు చేశారంటే, స్కాం జరిగిన ట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు.నైనీ వ్యవహారంలో మంత్రి భట్టి మసిబూసి మారేడు కాయ చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో సోలార్ స్కాం చేసిన ఆరోపణలపై మౌనం ఎందుకు వహిస్తున్నారని ఆరోపించారు. శనివారం హరీష్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ రెడ్డి బావమరిది కోసమే ఈ తతంగమంతానని విమర్శించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక, విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నైనీ టెండర్ రద్దు చేయడమే అవినీతికి నిదర్శనమని, అదే తరహాలో పిలిచిన మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా బీటింగ్ అరౌండ్ ద బుష్ లా ఏదో చెప్పి, మసిబూసి మారేడు కాయ చేసారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది నిజం. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్ మెన్ గా పాత్ర పోషించింది నిజం. నేను సూటిగా అడుగుతున్నా. ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారు?నిన్న బయటపెట్టిన మరో కుంభకోణం.. సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా ప్రెస్ మీట్ లో మాట్లాడలేదని నిలదీశారు. నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు? సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బిఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేయడం వల్ల నిజాలు అబద్దాలు అయిపోవు. జరిగిన స్కాంలు, స్కీంలుగా మారిపోవని స్పష్టం చేశారు. సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు? అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేసినట్లు? ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేసామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలని అన్నారు. భట్టి గారూ. మీరంటే నాకు చాలా గౌరవం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జీ లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాసాను. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తాను అని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్ధమని హరీష్‌రావు స్పష్టం చేశారు.

## నైనీ బ్లాక్ టెండర్లపై విచారణ

**రంగంలోకి దిగిన ఇద్దరు కేంద్ర బృందం సభ్యులు**

**హైదరాబాద్,జనవరి 24 :** నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వివాదంపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యుల సాంకేతిక కమిటీ సింగరేణి భవనానికి చేరుకుని విచారణను ప్రారంభించింది. సీఎస్ఆర్ నిధుల వినియోగం, టెండర్ నిబంధనలు వంటి అంశాలపై కేంద్ర బృందం ఆరా తీస్తోంది. సింగరేణి సీఎండీ కృష్ణ భాస్కర్ వద్ద ఈ బృందం వివరాలు సేకరిస్తోంది. శుక్రవారం రాత్రి 7 గంటలపాటు విచారణ జరిపింది. నేడు మరోసారి విచారణ చేపట్టిన బృందం వచ్చే సోమవారం తన నివేదికను కేంద్రానికి సమర్పించనుంది. కాగా.. నైనీ



బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్‌లో సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధన సరికాదని, అక్రమాలకు దారి తీస్తుందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో టెండర్లను రద్దు చేయాలని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించిన విషయం తెలిసిందే. అలాగే నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లలో అవినీతి ఆరోపణలపై స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. సమగ్ర విచారణకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందంతో కమిటీ ఏర్పాటైంది. బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, బొగ్గు శాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం సింగరేణిలో పర్యటించి.. నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరిపి, ఆ నివేదికను మూడు రోజుల్లో అందజేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

జనవరి 27వ తేదీన పార్లమెంట్‌లోని మెయిన్ కమిటీ రూమ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో చేపట్టనున్న లెజిస్లేటివ్, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. జనవరి 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. జనవరి 28తో ప్రారంభమయ్యే తొలి విడత బ్జడెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. రెండో విడత బ్జడెట్ సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తాయి. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు కేంద్ర బ్జడెట్ 2026-27ను ఉభయసభల్లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. సీతారామన్ వరుసగా ప్రవేశపెడుతున్న తొమ్మిదవ బ్జడెట్ ఇది. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకూ రాష్ట్రపతి బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఉంటుంది. దీనితో పాటు వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు-2025, ది సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్-2025, రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు-2024పై సభలో చర్చ ఉంటుంది. ఈ బిల్లులను తదుపరి పరిశీలన కోసం పార్లమెంటరీ స్థాయీ సంఘానికి లేదా సెలెక్ట్ కమిటీలకు పంపనున్నారు. కాగా, గత శీతాకాల సమావేశాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(గ్రామీణ్) చట్టంపైనా పార్లమెంటులో చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం చేసిన ఈ మార్పుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించడంతో పాటు కొత్త చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రచారం సాగిస్తోంది.

## దేశవ్యాప్తంగా 18వ రోజ్‌గార్ మేళా

(మొదటి పేజీ తరువాయి)

నియమితులవు తున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు. బీఎస్ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాండెంట్ నాయకత్వం వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.

## బండి,ధర్మపురిలకు కెటిఆర్ లీగల్ నోటీసులు

**హైదరాబాద్,జనవరి 24 :**కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకు సంజయ్, అర్వింద్‌లకు విడివిడిగా లీగల్ నోటీసులు జారీ చేశారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అడ్డగోలుగా మాట్లాడిన వీరు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా కేవలం దురుద్దేశం పూర్వకంగా, రాజకీయాల కోసం దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు బండి సంజయ్, అర్వింద్‌లకు కేటీఆర్ తన న్యాయవాదులతో నోటీసులు పంపించారు. కేటీఆర్ కుటుంబం ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు సంపాదించిందని, సెలబ్రిటీల ఫోన్లు ట్యాప్ చేశారంటూ ఈనెల 23న నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే బండి సంజయ్‌పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా నడుస్తున్నప్పటికీ, మళ్లీ అదే తరహాలో తప్పుడు ఆరోపణలు చేయడం దురుద్దేశపూర్వకమని మండిపడ్డారు. మరోవైపు ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు పంపిన నోటీసులో ఆయన చేసిన వ్యక్తిగత దూషణలను తప్పుబట్టారు. డ్రగ్స్ సేవించడం, సరఫరా చేస్తున్నారంటూ అర్వింద్ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని పేర్కొన్నారు.

## సొంత చెల్లెలే ఫోన్ ట్యాప్ బారిన పడ్డారు

(మొదటి పేజీ తరువాయి)

ఆరిపోకుండా చూసుకోవాలని సెటైర్లువేశారు. ఫోన్ ట్యాపింగ్పై కెటిఆర్ మాట్లాడటం పూర్తిగా హాస్యాస్పదమన్నారు. తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే ఇప్పటివరకు సరైన సమాధానం చెప్పలేదని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు చాలాతీవ్రమైనదని, దీనిని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని స్పష్టం చేశారు. అధికారులకు కూడా పరిమితులు ఉంటాయని అన్నారు. కాళేశ్వరం అవినీతి పై కెసిఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ను తాను నేరుగా ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అలాగే బిజెపి నేతలపై ఉన్న ఇడి కేసులు ఎందుకు పెండింగ్లో ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ కీలక ప్రశ్న లేవనెత్తారు. దేశ భద్రతకు ముప్పుగా మారే శక్తులపై మాత్రమే ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని, అలాంటప్పుడు సినిమావాళ్లఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. నక్సలైట్లతో లావాదేవీలు జరుగుతున్నాయన్న అనుమానంతో తన ఫోన్ను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. కెసిఆర్ కుటుంబంలో తగాదాలకు అసలు కారణం వాటాల పంపకంలో తేడాలేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ పాలనలో కేవలం మూడు నెలల్లోనే 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపించారు. తన మిత్రుడి ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని తెలిపారు.

## యధాతథంగా టీహబ్ కార్యాలయం

**హైదరాబాద్,జనవరి 24 :** టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై సీఎస్ రామకృష్ణారావుకు అమెరికా నుంచి ఫోన్ చేసి సీఎం మాట్లాడారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు మారుస్తున్నారనే వార్తలను ఖండించారు. టీహబ్‌లో ఇతర ఆఫీసులు ఉండకూడదని ఆదేశించారు. అలాంటి ఆలోచనలు అధికారులు విరమించుకోవాలన్నారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ ఆఫీసులను ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు.టీ హబ్ ను స్టార్టప్ కేంద్రంగా కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు.

## నుమాయిష్‌కు రాకండి..: అగ్నిప్రమాదంతో సజ్జన్నార్ సూచన



**హైదరాబాద్,జనవరి 24:** నాంపల్లిలోని ఫర్నిచర్ షాపులో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా నుమాయిష్ ను ఒకరోజు నాంపల్లి నుమాయిష్‌ను సందర్శకులు వాయిదా వేసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ సూచించారు. అగ్నిప్రమాదం కారణంగా ఘటనా ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించిందని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, సందర్శకులు తమ ఎగ్జిబిషన్ పర్యటనను ఆదివారానికి వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాంపల్లిలో బచ్చా క్రిస్టల్ ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. నాలుగు అంతస్తుల భవనంలో ఇద్దరు చిన్నారులతో సహా ఆరుగురు చిక్కుకున్నట్లు సమాచారం . ఫైరిరజన్లు రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. గ్రౌండ్ ఫలోర్ నుంచి దట్టమైన పొగలు రావడంతో వారు బయటకు రాలేక పై అంతస్తుల్లోనే ఉండిపోయారు. జేసీబీలు, భారీ క్రేన్ల సహాయంతో భవనం పైభాగంలో ఉన్న వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు రెస్క్యూ టీమ్ తీవ్రంగా శ్రమించింది.

## మెట్ల మార్గం పునరుద్ధరణ పనులను పరిశీలించిన కార్పొరేటర్







**అడ్డగుట్ట, జనవరి 24, (పీపుల్స్ న్యూస్ ) :** అడ్డగుట్ట బి సెక్షన్ ప్రాంతంలో జరుగుతున్న మెట్ల మార్గం పునరుద్ధరణ పనులను శనివారం కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్ పరిశీలించారు. ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సహకారంతో ఈ పనులు ప్రారంభమయ్యాయి. చాలా కాలంగా మెట్ల మార్గం శిథిలావస్థలో ఉండడంతో ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ గారు తెలిపారు. ప్రజల భద్రత, సౌకర్యం కోసం ఈ పునరుద్ధరణ పనులు చేపట్టామని, పనులు పూర్తయ్యాక మెట్ల మార్గం మరింత బలంగా, సురక్షితంగా మారి అందరికీ ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం జిహెచ్ఎంసీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షిస్తూ, నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ స్రవంతి, శ్రీకాంత్,సలీం, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్,మనోహర్, ఎల్లయ్య, దేవయ్య, నర్సింగ్, గోపి,కిట్టు, రవి,నరేష్, శంకర్, రాజు,అషు, తదితరులు పాల్గొన్నారు.

## ఐపిఎస్‌గా పదోన్నతి పొందిన చంద్రయ్య కి శుభాకాంక్షలు తెలిపిన వెంకటేష్..!!



**గోదావరిఖని జనవరి 24 (పీపుల్స్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచేలా ఐఏఎస్?గా పదోన్నతి పొందిన చంద్రయ్యకు ఎదులాపురం వెంకటేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, చంద్రయ్య క్రమశిక్షణ, కఠిన శ్రమ, సేవాభావమే ఈ స్థాయికి తీసుకువచ్చాయని ప్రశంసించారు.సాధారణ నేపథ్యం నుంచి ఉన్నత స్థాయికి ఎదగడం అనేది యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్న వెంకటేష్, ప్రజాసేవలో చంద్రయ్య మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఐఏఎస్ గా ఆయన చేపట్టే బాధ్యతలు రాష్ట్ర అభివృద్ధి కి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## భోజనం తర్వాత టీ తాగడం వల్ల మీ ఆరోగ్యం దెబ్బతింటుందా? అసలు విషయం తెలిస్తే షాకవుతారు!

భోజనంతో లేదా భోజనం తర్వాత టీ తాగడం వల్ల కూడా మీ జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. టీలోని కెఫిన్ కడుపు ఆమ్లాన్ని పెంచుతుంది. ఇది ఆమ్లత్వం, గుండెల్లో మంట లేదా ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుంది. అవసరమైన పోషకాలు..టీ అనేది ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది ఇష్టపడే పానీయం. ముఖ్యంగా మన భారతదేశంలో ఇది చాలా ప్రజాదరణ పొందింది. ఉదయం లేదా సాయంత్రం అయినా ప్రజలు దీనిని తాగకుండా ఉండలేరు. కొందరు భోజనంతో లేదా భోజనం తర్వాత వెంటనే కూడా దీనిని ఆస్వాదిస్తారు. అయితే భోజనంతో పాటు లేదా భోజనం తర్వాత వెంటనే టీ తాగడం మీ ఆరోగ్యానికి చాలా హానికరం అని నిపుణులు చెబుతున్నారు. ఇది రుచిగా ఉన్నప్పటికీ ఈ కలయిక వైద్యపరంగా చాలా ప్రమాదకరం అంటున్నారు. భోజనంతో పాటు లేదా భోజనం తర్వాత టీ తాగే అలవాటు ఎంత హానికరమో అన్వేషిద్దాం.ఇవి కూడా ప్రతికూలతలు కావచ్చు:జీర్ణవ్యవస్థలో ఆటంకాలు: భోజనంతో లేదా భోజనం తర్వాత టీ తాగడం వల్ల కూడా మీ జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. టీలోని కెఫిన్ కడుపు ఆమ్లాన్ని పెంచుతుంది. ఇది ఆమ్లత్వం, గుండెల్లో మంట లేదా ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుంది. అవసరమైన పోషకాలు లేకపోవడం: టీ శరీరం ఐరన్?ను గ్రహించకుండా నిరోధించడమే కాకుండా ఆహారం నుండి ఇతర పోషకాలను కూడా నిరోధిస్తుంది. ఇది అవసరమైన పోషకాల లోపానికి దారితీస్తుంది. ఇది ఎముకల బలహీనతకు, రోగనిరోధక శక్తి బలహీనపడటానికి దారితీస్తుంది . నిద్ర సమస్యలు: రాత్రి భోజనంతో పాటు లేదా తర్వాత టీ తాగడం వల్ల మీ నిద్ర దెబ్బతింటుంది. టీలోని కెఫిన్ మీ మెదడుపై ఎఫెక్ట్ చూపుతుంది. దీంతో నిద్రకు భంగం కలుగుతుంది.

## టైఫాయిడ్ జ్వరంతో బాధపడేవారికి మునగాకు దివ్యౌషధమే.. ఎలా తీసుకోవాలంటే?

ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న మునగ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. దాదాపు అన్ని సీజన్లలో లభించే మునగ ఆకులు ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లను అందిస్తాయి. వీటిని సూప్?ల నుంచిమునగ ఆకులు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న ఈ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. దాదాపు అన్ని సీజన్లలో లభించే మునగ ఆకులు ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లను అందిస్తాయి. వీటిని సూప్?ల నుంచి సాంబారు, పాల్య వంటి వివిధ వంటలలో ఉపయోగిస్తారు. ఆయుర్వేదం ప్రకారం, మునగ ఆకులను తీసుకోవడం ద్వారా అనేక రకాల ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. కాబట్టి దీనిని తీసుకోవడం ద్వారా ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చు? ఏ సమస్యకు దివ్యౌషధమో ఇక్కడ తెలుసుకుందాం..మునగ ఆకు ఆరోగ్య ప్రయోజనాలు మునగ ఆకు పోషకాలకు నిలయం. కేవలం 100 గ్రాముల మునగ ఆకులో నారింజ కంటే ఏడు రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. మెగ్నీషియం, విటమిన్లు కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి.టైఫాయిడ్ జ్వరంతో బాధపడేవారు మునగ ఆకులతో పాటు వేర్లను నీటిలో మరిగించి తీసుకోవడం ద్వారా త్వరగా జ్వరాన్ని తగ్గించుకోవచ్చు.మీకు తీవ్రమైన తలనొప్పి ఉంటే ఈ మొక్క ఆకులను చూర్ణం చేసి తలకు పట్టిస్తే నొప్పి క్రమంగా తగ్గుతుంది.మునగ చెట్టు వేర్లు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. మీకు గొంతు నొప్పి ఉంటే దాని కాండంతో తయారు తీసిన కషాయంతో పుక్కిలించడం వల్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.మునగ ఆకును నానబెట్టి లేదా మరిగించి తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.మీరు శారీరక బలహీనత లేదా అలసటతో బాధపడుతుంటే మునగ పువ్వులు, ఆకులను నీటిలో మరిగించి తాగవచ్చు. ఇది ఆర్థరైటిస్ నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

## ముస్త్యాలలో విజయవంతంగా ముగిసిన క్రికెట్ టోర్నమెంట్..!!

### ముస్త్యాల మాజి సర్పంచ్ లావణ్య నాగరాజు ఆధ్వర్యంలో

**గోదావరిఖని జనవరి 24 (పీపుల్స్ న్యూస్):** ముస్త్యాల గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ అత్యంత ఉత్సాహభరితంగా, క్రీడాస్ఫూర్తిని ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది. గ్రామీణ యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, స్నేహభావం మరియు ఐక్యతను పెంచే లక్ష్యంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు. 11 జట్లతో ఉత్సాహంగా పోటీలు ఈ టోర్నమెంట్‌లో మొత్తం 11 జట్లు పాల్గొనగా, ప్రతి జట్టు ఆటగాళ్లు ఎంతో ఉత్సాహంగా పోటీపడ్డారు. కఠినమైన పోటీ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్?లో సుందిల్ల టీం అద్భుతమైన ప్రదర్శన కనబరిచి విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన



సుందిల్ల టీంకు మొదటి బహుమతిగా రూ.10,000 నగదు అందజేశారు.రన్నర్స్?గా గడ్డం పల్లె టీం ఫైనల్?లో పోటీపడిన గడ్డం పల్లె టీం రన్నర్స్?గా నిలిచి ప్రశంసనీయం అయిన ఆటతీరుతో ప్రేక్షకుల మన్ననలు పొందింది. రన్నర్స్?గా నిలిచిన గడ్డం పల్లె టీంకు రెండవ బహుమతిగా రూ.5,000 నగదు అందజేశారు.ప్రతి జట్టుకు టీ–షర్టులు -- ప్రత్యేక ఆకర్షణ ప్రత్యేక ఆకర్షణగా, ఈ టోర్నమెంట్?లో పాల్గొన్న మొత్తం 11 జట్లకు గాను ప్రతి జట్టుకు ప్రత్యేకంగా టీ–షర్టులు అందజేయడం జరిగింది. ఇది క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపడంతో పాటు, నిర్వాహకుల క్రీడాప్రోత్సాహక దృక్పథానికి నిదర్శనంగా నిలిచింది.ఈ సందర్భంగా మాజి సర్పంచ్ లావణ్య--నాగరాజ్ మాట్లాడుతూ, గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతను సరైన మార్గంలో నడిపించవచ్చని, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని క్రీడా కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామీణ క్రీడాస్ఫూర్తికి నిదర్శనంగ్రామ పెద్దలు, యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ టోర్నమెంట్?ను విజయవంతం చేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ముస్త్యాల గ్రామంలో క్రీడా చరిత్రలో ఒక మధుర జ్ఞాపకంగా నిలిచింది.

## మేడారంలో తప్పిపోయే పిల్లల ఆచూకీకి 'రిస్ట్ బ్యాండ్లు'

### వనదేవతల జాతరలో చిన్నారులు, దివ్యాంగులకు భద్రత డిజిపి బి. శివధర్ రెడ్డి చేతుల మీదుగా సీటీఎంఎస్ ప్రారంభం

**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో, జనవరి 24, (పీపుల్స్ న్యూస్ ) :** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరలో భక్తుల వెంట వచ్చే చిన్న పిల్లలు, దివ్యాంగులు ఒకవేళ తప్పిపోతే వారి ఆచూకీని తక్షణమే కనిపెట్టి, సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చేందుకు 'చిల్డ్రన్ ట్రాకింగ్ అండ్ మానిటరింగ్ సిస్టమ్' (సిటిఎంఎస్) రిస్ట్ బ్యాండ్లు అద్భుతంగా పనిచేస్తాయని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ బి. శివధర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ సహకారంతో రూపొందించినఈ వినూత్న క్యూఆర్ కోడ్ ఆధారిత రిస్ట్ బ్యాండ్లను, సంబంధిత పోస్టర్లను ఆయన లాంచనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి 31 వరకు ములుగు జిల్లాలో అత్యంత వైభవంగా జరిగే మేడారం జాతరకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్?గఢ్ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని వివరించారు. ఇంతటి భారీ రద్దీలో చిన్న పిల్లలు, వయోవృద్ధులు, దివ్యాంగులు తప్పిపోయే అవకాశం ఉందని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వారి భద్రతను పటిష్టం చేయడానికే ఈ సాంకేతికతను తీసుకొచ్చామని తెలిపారు. ఎస్ఐబి ఐ జి పి బి.సుమతి గత ఒకటిన్నర నెలలుగా కష్టపడి ఈ విధానాన్ని సిద్ధం చేశారని,దీనిని రూపొందించడంలో వొడాఫోన్ యాజమాన్యం అందించిన సహకారం అభినందనీయమని కొనియాడారు. మహిళా భద్రత విభాగం డిజిపి చారుసిన్హా పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని జాతరలో పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. భవిష్యత్తులో మహా కుంభమేళా వంటి ఇతర భారీ




ఉత్సవాల్లో కూడా ఈ విధానాన్ని వినియోగించుకోవచ్చని డిజిపి అభిప్రాయపడ్డారు.ఈ సీటీఎంఎస్ విధానం ద్వారా జాతరకు వచ్చే పిల్లలు, దివ్యాంగుల వివరాలను నమోదు చేసి వారి చేతికి ఒక ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ రిస్ట్ బ్యాండ్?ను కడతారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 11 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లోని బృందాలు పిల్లల పేరు, తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నంబర్లను నమోదు చేస్తాయి. ఒకవేళ ఎవరైనా తప్పిపోయి కనిపిస్తే, అక్కడి వాలంటీర్లు లేదా పోలీసు సిబ్బంది తమ స్మార్ట్?ఫోన్?లతో ఆ బ్యాండ్?పై ఉన్న క్యూఆర్ కోడ్?ను స్కాన్ చేస్తే చాలు.. వెంటనే వారి తల్లిదండ్రుల లేదా సంరక్షకుల ఫోన్ నంబర్లు, డయల్ 100 వివరాలు కనిపిస్తాయి. దీనివల్ల తక్షణమే వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, సురక్షితంగా అప్పగించే అవకాశం ఉంటుంది. అనంతరం వారు కుటుంబంతో కలిసిన ఫోటోను కూడా సిస్టమ్?లో అప్?లోడ్ చేస్తారు.ఈ కార్యక్రమం కోసం మొత్తం 25,000 రిస్ట్ బ్యాండ్లను అందుబాటులో ఉంచారు. ఇవి ఈ నెల 27 నుంచి 31 వరకు 24 గంటల పాటు పనిచేసే 11 కేంద్రాల్లో లభిస్తాయి. హన్మకొండ హయగ్రీవాచారి గ్రౌండ్, హైదరాబాద్?లోని ఉప్పల్ బస్ స్టేషన్, ఎంజీబీఎస్,కరీంనగర్, పరకాల, పెద్దపల్లి, మంథని, ఏటూరునాగారం, కాటారం బస్ స్టేషన్లతో పాటు వరంగల్,






కాజీపేట రైల్వే స్టేషన్లలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. స్థానిక పోలీసు సిబ్బంది, మహిళా భద్రత విభాగం, టీజీఎస్?ఆర్?టీసీ సిబ్బంది సమన్వయంతో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఎవరైనా క్యూఆర్ కోడ్ బ్యాండ్ ధరించిన వ్యక్తి ఒంటరిగా కనిపిస్తే వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని డిజిపి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిజిపి లు మహేష్ ఎం. భగవత్, చారుసిన్హా, డి.ఎస్. చౌహాన్, ఐజిపిలు చంద్రశేఖర్ రెడ్డి, బి.సుమతి, డాక్టర్ గజరావు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాణి కుముదిని దేవి జన్మదిన వేడుకలు
















**కూకట్ పల్లి : జనవరి 24 (పీపుల్స్ న్యూస్):**పేద ప్రజలకు విద్యా, వైద్యం అందాలని హైదరాబాద్ మొదటి మున్సిపల్ కార్పొరేషన్ మొదటి మహిళ రామ్ దేవ్ రావు ఆసుపత్రి వ్యవస్థాపకురాలు వడ్డేపల్లి సంస్థానానికి చెందిన ఆడపడుచు వనపర్తి సంస్థానానికి చెందిన కోడలు ఐనటువంటి రాణి కుముదిని దేవి జన్మదినన్ని పురస్కరించుకొని శివనంద రెహబిలిటేషన్ హోమ్,రాందేవ్రావు హాస్పిటల్, కుముదిని దేవి స్కూల్ అండ్ కాలేజ్ అఫ్ నర్సింగ్ లో వివిధ కార్యక్రమాలు జరిపించారు, దీని లో మొదటగా రాందేవ్రావు హాస్పిటల్ లో రాణి కుముదిని దేవి చిత్ర పటానికి రాందేవ్ రావు హాస్పిటల్ ఎండి, డాక్టర్ కమలాకర్ పూల మాల వేసారు, ఈ కార్యక్రమం లో డాక్టర్స్, నర్సెస్, అడ్మినిస్ట్రేషన్, ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొని ఆమె చేసిన కార్యక్రమాలు కొనియాడారు.శివనంద రెహబిలిటేషన్ హోమ్ లో ఆమె యొక్క విగ్రహానికి రంతిదేవ్ రావు , మీరా రావు, విక్రందేవ్ రావు , జ్యోతి రావు ,విజయలక్ష్మి ,పృథ్వీరెడ్డి ,భారతి రెడ్డి ,విష్ణువర్ధన్ రెడ్డి ,అపర్ణ రావు , ప్రశాంత్ రెడ్డి , శివానంద రిహబిలిటేషన్ హోమ్ సీఏఓ డాక్టర్ అనంత్ రెడ్డి పూల మాలతో విగ్రహాన్ని అలంకరించారు జస్టిస్ జగన్నాద్ రెడ్డి సతీమణి పరిమళ జగన్మోహన్ రెడ్డి పేరు మీద ఉచిత శివనంద ఫిజియో రిహాబ్ సెంటర్ ప్రదీప్ చౌదరి ప్రారంభించారు. పరిమళ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటాన్ని జయరాం పింగళి , ఊర్మిళ పింగళి, గౌతమ్ పింగళి , సురేఖ పింగళి, విద్యాసాగర్ రావు , దీపిక ఆవిష్కరించారు. తర్వాత రాణి కుముడిని దేవి స్కూల్ అండ్ కాలేజీ అఫ్ నర్సింగ్ లో కొత్తగా ప్రవేశించిన బి.ఎస్ సి, జి. ఎన్ .ఎం విద్యార్థిని విద్యార్థులకు లాంప్ లైటింగ్ ప్రారంభించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ ప్రతిజ్ఞ ను మేరీ డేవిడ్ కాలేజీ ప్రిన్సిపాల్ అర్చన విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో రాందేవ్ రావు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ , సి. ఈ.ఓ డాక్టర్ యోబు ఇతర హాస్పిటల్, కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సలెన్స్ అవార్డు అందుకునున్న రాందేవరావ్ ఆసుపత్రి.

**కూకట్ పల్లి : జనవరి 24 (పీపుల్స్ న్యూస్):**సామాజిక సేవలో భాగంగా పేద ప్రజలకు వైద్యం అందిస్తూ... సమాజం పట్ల బాధ్యతను నెరవేరుస్తున్న రాందేవ్ రావ్ ఆసుపత్రికి గవర్నర్ కార్యాలయం నుండి ఆహ్వానం అందింది. గ్రామీణ ప్రాంతాల్లోని అనేక గ్రామాలలో ఉచితంగా వైద్యం అందిస్తున్న సందర్భంగా 20 25 సంవత్సరానికి గాను తెలంగాణ గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డు ప్రకటించారు. ఈనెల 26వ తేదీన లోక్ భవన్ లో జరగనున్న సన్మాన కార్యక్రమానికి హాజరై అవార్డును స్వీకరించాలని రాందేవ్ రావ్ ఆసుపత్రి యాజమాన్యానికి ఆహ్వానం అందింది

# అధికారులకు లంచాలు..
# బిల్డర్లకు అంతస్తులు

- ఎస్సార్ నగర్ లో అక్రమ నిర్మాణం.!
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి భారీ నష్టం.
- ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్న బిల్డర్లు.
- రెసిడెన్షియల్ అనుమతితో.. కమర్షియల్ భవనాలు.



**అమీర్పేట్ : జనవరి 24 (పీపుల్స్ న్యూస్)**
అమీర్ పేట సర్కిల్ 39 పరిధిలోని ఎస్సార్ నగర్ ప్రాంతం లో మరోసారి అక్రమ నిర్మాణం వెలుగులోకి వచ్చింది. ప్లాట్ నెంబర్ 93/2RTలో అనుమతులకు మించి ఐదు అంతస్తులు నిర్మాణం జరగడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. నిత్యం అధికారులు అక్రమ నిర్మాణం వైపు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ దీనిపై చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బిల్డర్ల అత్యుత్సాహం -ప్రభుత్వానికి భారీ నష్టం.**
నియమ నిబంధనలను తుంగలో తొక్కుతూ బిల్డర్లు అక్రమ ంగా అంతస్తులు పెంచుతున్నా, సంబంధిత అధికారులు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, నిర్మాణదారులతో అధికారులు కుమ్మక్కయ్యారనే అనుమానాలు బలపడుతున్నాయి. ఎస్సార్ నగర్ లో నిర్మించిన ఐదు అంతస్తుల నిర్మాణానికి అధికారుల అండదండలు ఉన్నట్లు స్పష్టం అవుతుంది. డబ్బులు సంపాదనే లక్ష్యంగా బిల్డర్లు అక్రమ నిర్మాణాలకు తెగబడి ప్రభుత్వ రాబడిని అడ్డుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తు న్నారు. అక్రమ నిర్మాణాలకు తెరలేపుతున్న బిల్డర్ల వల్ల ప్రభుత్వం భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటోంది. అభివృద్ధి పేరుతో అక్రమాలకు ప్రోత్సాహం లభిస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.**
అమీర్పేట సర్కిల్ 39 పరిధిలోని ఎస్సార్ నగర్ ప్రాంతంలో ప్లాట్ నెంబర్ 93/2RT జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని ఉన్న తాధికారులు అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక సర్కిల్లో అధికారులు అక్రమ నిర్మాణాలను అరికట్ట డంలో విఫలమవుతున్నారని, అక్రమ నిర్మాణాలను కట్టడి చేసే బాధ్యత ఉన్నతాధికారులైన తీసుకోవాలని ప్రజల కోరుతు న్నారు. బాధ్యతరాహిత్యంగా అక్రమ నిర్మాణాలు తెగబడుతున్న వారిపై జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# జగన్ రాష్ట్రాన్ని అప్పులతో పాటు చెత్తకుప్పలా మార్చారు



మంత్రి అనగాని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, స్వచ్ఛత కార్యక్రమాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, చెత్త నిర్వహణ కూడా నిర్లక్ష్యం చేయబడిందని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమంతో రాష్ట్రాన్ని పూర్తిగా మార్చేస్తామని ఆయన తెలిపారు.చెత్త నిర్వహణ విషయంలో ఆధునిక విధానాలు అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి రీసైక్లింగ్‌కు పంపిస్తున్నామని, అలాగే చెత్తను రేపల్లెలోని విద్యుత్ ప్లాంట్?కు తరలించి విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్నామని వివరించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు శక్తి ఉత్పత్తి కూడా జరుగుతుందని పేర్కొన్నారు.అలాగే రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి పెట్టారని అనగాని అన్నారు. విశాఖపట్నాన్ని ఐటీ హబ్‌గా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, పెట్టుబడులు, కంపెనీలు ఆకర్షించేలా విధానాలు చేస్తున్నామని చెప్పారు.

# జైలు నుంచి జోగి సోదరులు విడుదల



**విజయవాడ/ములకలచెరువు:** నకిలీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాము శుక్రవారం సాయంత్రం జైలు నుంచి విడుదలయ్యారు. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు వారికి శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో విజయవాడ జిల్లా జైలు నుంచి బయటకు అడుగుపెట్టారు. ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీ గుట్టును గత ఏడాది అక్టోబరు 3న ఎక్సైజ్ పోలీసులు రట్టు చేశారు. ఇక్కడ తీగ లాగితే ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో కూడా డొంక కదలడంతో అక్కడ కూడా నకిలీ మద్యం తయారీ యూనిట్‌పై దాడులు చేశారు. రెండు కేసుల్లోనూ ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు(ఏ1) వాంగ్మూలంతో నవంబరు 2న జోగి సోదరులను అరెస్టు చేశారు. అలాగే ములకలచెరువు నకిలీ మద్యం కేసులోనూ జోగి సోదరుల పాత్ర, కుట్ర బయటపడడంతో డిసెంబరు 2న వారిని తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్? విధించడంతో విజయవాడ జైలుకు తరలించారు. జోగి సోదరులకు ఈనెల 20న ఇబ్రహీంపట్నం కేసులో విజయవాడ కోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసినా ములకలచెరువు కేసులో బెయిల్? రాకపోవడంతో అప్పుడు విడుదల కాలేదు. తాజాగా ములకలచెరువు కేసులో కూడా బెయిల్? మంజూరు కావడంతో జోగి సోదరులు విజయవాడ జైలు నుంచి విడుదల అయ్యారు. దీంతో 83 రోజుల జైలు జీవితానికి విముక్తి లభించింది. జైలు నుంచి విడుదలయ్యాక జోగి రమేశ్? మీడియాతో మాట్లాడారు. తనను అన్యాయంగా కేసులో ఇరికించి 83 రోజులు జైల్లో ఉంచి, కోర్టుల చుట్టూ తిప్పారని, సిట్ అధికారులు చంద్రబాబు చెప్పినట్లే వింటున్నారని విమర్శించారు. తనపై కేసులు పెట్టిన అధికారులను భగవంతుడు శిక్షిస్తాడని శాపనార్థాలు పెట్టారు.

# అన్నవరం ప్రసాదం బుట్టలో ఎలుకలు అధికారుల చర్యలివే



**కాకినాడ, జనవరి 24:** అన్నవరం ప్రసాదం బుట్టలో ఎలుకల వ్యవహారంపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలపై ఉన్నతాధికారులు స్పందించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇద్దరు దేవస్థానం ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ప్రసాదం బుట్టలపై ఎలుకలు ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఔట్?సోర్సింగ్ ఉద్యోగులపై ఈ మేరకు చర్యలు చేపట్టిన ఆలయ ఈఓ త్రినాథరావు.. త్రిమూర్తులు, రాజు అనే ఇద్దరినీ విధుల నుంచి తొలగించారు. అంతేకాకుండా ప్రసాదం కౌంటర్లోకి ఎలుకలు చొరబడకుండా ఉండేందుకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు అధికారులు. కౌంటర్?పై నుంచీ ఎలుకలు ప్రవేశించకుండా సీలింగ్ కూడా నిర్మించాలని నిర్ణయించారు.ఇదీ జరిగింది.అన్నవరం దేవస్థానంలో భక్తులకు విక్రయించే ప్రసాదాల విషయమై ఇటీవల ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వెలువడిన ఓ కథనం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రసాదాలు విక్రయించే బుట్టల్లో యథేచ్ఛగా ఎలుకలు తిరుగుతున్నా.. ఆలయ సిబ్బంది ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి. ఇటీవల కొందరు భక్తులు అన్నవరం హైవేపై ప్రసాదాలు కొనుగోలు చేస్తూ.. ఈ విషయమై ప్రశ్నించగా సిబ్బంది నిర్లక్ష్యంగా ప్రతిస్పందించారు. ఈ వ్యవహారంపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు రావడంతో అధికారులు నష్ట నివారణ చర్యలు చేపట్టారు.

# విశాఖలో నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు లక్షల్లో ఫేక్ నోట్లు స్వాధీనం




**విశాఖపట్నం, జనవరి 24:** విశాఖ రైల్వే స్టేషన్‌లో నకిలీ కరెన్సీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సంయుక్తంగా నిర్వహించిన సాధారణ తనిఖీల్లో నకిలీ కరెన్సీ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి 200 రూపాయల నోట్ల రూపంలో మొత్తం రూ.3.32 లక్షల విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన నితీశ్ కుమార్, ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన గురు సునీల్ కుమార్?లుగా గుర్తించారు.నిందితులను విచారించగా.. హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి ఇన్?స్టాగ్రామ్ ద్వారా పరిచయమైనట్లు తెలిపారు. రూ.50 వేల అసలు కరెన్సీకి మూడింతల(రూ.1.50 లక్షలు) విలువైన నకిలీ కరెన్సీ ఇచ్చేలా సదరు వ్యక్తితో ఒప్పందం కుదిరింది. నిందితులు ప్రధానంగా కోడిపందేలను టార్గెట్ చేసుకున్నారు. ఆ పందేల్లో చాలా మంది నకిలీ కరెన్సీని ఉపయోగిస్తారని భావించి, అక్కడ చలామణి చేసేందుకు ప్లాన్ చేశారు. అయితే కోడిపందేల్లో నకిలీ కరెన్సీ చలామణి కాకపోవడంతో విశాఖపట్నంలో ఓ వ్యక్తికి ఇచ్చేందుకు వచ్చారు. రైల్వే స్టేషన్?లో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో అడ్డంగా దొరికిపోయారు. ఆ ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు.. మరిన్ని వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు సమాచారం.ఈ వ్యవహారంపై జీఆర్‌పీ సీఐ ధనుంజయ నాయుడు మీడియాతో మాట్లాడారు. రైళ్లలో స్మగ్లింగ్, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని.. ప్రజలు ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు.

# అధికారులపై ఏపీ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు ఏసీ రూములో కూర్చొని నిర్ణయాలా




**అమరావతి:** ప్రభుత్వ అధికారులపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఏసీ రూముల్లో కూర్చుని నిర్ణయాలు తీసుకుంటారా.. క్షేత్ర స్థాయిలో ఇబ్బందుల గురించి ఎలా తెలుస్తుంది అంటూ ప్రశ్నించారు. ఇంతకీ కోర్టు ఇంత సీరియస్ అయ్యింది ఏ విషయంలో అంటే.. చేపలు, మాంసం దుకాణాలకు ఈ-వేలం వేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.ఈ క్రమంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. చేపలు, మాంసం దుకాణాలకు ఈ-వేలం నిర్వహిస్తే.. కంప్యూటర్ పరిజ్ఞానం లేని చిన్న చిన్న వ్యాపారులు ఈ-వేలంలో ఎలా పాల్గొంటారు, పేపర్లను ఎలా అప్‌లోడ్ చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ-వేలం విధానాన్ని అనుసరించడంపై తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది.ఈ-వేలం ప్రక్రియలో క్షేత్ర స్థాయి సమస్యలను పరిగణనలోకి తీసుకో కుండా.. ఏసీ రూముల్లో కూర్చుని అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాకుండా, ఈ-వేలం టెండర్ గురించి తెలుగు పేపర్లలో కూడా ఇంగ్లీషులో ప్రకటనలు ఇవ్వడంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. చిరు వ్యాపారులకు సంబంధించిన ఇలాంటి వ్యవహారాల్లో బహిరంగ వేలం నిర్వహించడమే ఉత్తమమని కోర్టు అభిప్రాయపడింది.విజయవాడలోని మహంతి మార్కెట్?లో మాంసం, చేపల దుకాణాల కేటాయింపు కోసం జనవరి 6న అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్‌ని.. తర్వాతి విచారణ పూర్తి అయ్యే వరకు సస్పెండ్ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని విజయవాడ కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. తర్వాతి విచారణను మార్చి 3కి వాయిదా వేసింది. హైకోర్టు రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. విజయ వాడ మహంతి సంబంధించి ఈ-వేలం నోటిఫికేషన్‌ఇవ్వడాన్ని సవాలు చేస్తూ స్థానిక చేపల వ్యాపారి హరిమాణిక్యం శంకరరావు అనే వ్యక్తి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్? వేశారు. అధికారులు ఈ-వేలం ప్రక్రియ నిర్వహిస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల తమకు వేలంలో పాల్గొనే అవకాశం లేకుండా పోయిందని కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన కోర్టు.. అధికారుల తీరును తీవ్రంగా తప్పు పట్టింది.

# వైజాగ్ లో వింత మందుకు పైసలు లేవని ఆర్టీసీ బస్సు దొంగతనం




**విశాఖపట్నం :** విశాఖపట్నంలో ఓ వింత దొంగతనం ఘటన వెలుగులోకి వచ్చింది. మద్యం తాగేందుకు డబ్బులు కావాలనే ఉద్దేశంతో ఓ వ్యక్తి ఏకంగా ఆర్టీసీ బస్సునే దొంగిలించడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనలో బస్సును దొంగిలించి అందులోని డీజిల్ అమ్ముకుని మద్యం కోసం డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో నిందితుడు ఈ నేరానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం, టీవీ నాయుడు అనే వ్యక్తి తన ఆరు బస్సులను ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన నడుపుతున్నారు. ఈ నెల 16న రాత్రి శ్రీకాకుళం నుంచి వచ్చిన ఏపీ 39యూఎక్స్ 2888 నంబర్ గల బస్సును డ్రైవర్ అప్పారావు మద్దిలపాలెం డిపోలో పార్క్ చేసి విశ్రాంతి తీసుకోవడానికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూసేసరికి బస్సు కనిపించకపోవడంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసిన పోలీసులు మద్దిలపాలెం డిపోతో పాటు కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. బస్సు లంకిల పాలెం జంక్షన్ వైపు వెళ్లినట్లు గుర్తించగా, యజమాని దగ్గర పనిచేసే మరో డ్రైవర్ ఈగల పైడిరాజు అనకాపల్లి జిల్లా ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం రావడంతో దర్యాప్తు ముమ్మరం చేశారు.ఈ నెల 19న రామా టాకీస్ సమీపంలోని ప్రభుత్వ కంటి ఆసుపత్రి దగ్గర పైడిరాజు బస్సును నడుపుకుంటూ వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. విచారణలో తాను మద్యానికి బానిసనని, డీజిల్ అమ్ముకుని ఆ డబ్బుతో మద్యం తాగాలనే ఉద్దేశంతో బస్సును దొంగిలించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు.ఇది పైడిరాజుకు ఇదే మొదటి నేరం కాదని పోలీసులు వెల్లడించారు. గతేడాది ఫిబ్రవరిలో కూడా ద్వారకానగర్ బస్టాండ్‌లో ఇదే యజమానికి చెందిన బస్సును దొంగిలించి డీజిల్ అమ్ముకుని డబ్బులు సంపాదించి, తర్వాత బస్సును హైవేపై వదిలేసిన ఘటనపై అప్పట్లోనే కేసు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో విశాఖలో భద్రతపై చర్చ మొదలైంది. బస్సు డిపోల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# పిల్లలకు చట్టాలపై అవగాహన ఉండాలి



**అనకాపల్లి జిల్లా :** కశింకోట మండలం తేగాడ మోడల్ స్కూల్?లో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ఆమె సరదాగా ముచ్చటించారు. విద్యార్థులు తమకు ఆడుకోవడానికి ఒక మంచి క్రీడా మైదానం కావాలని కోరగా, హోంమంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలోనే మైదానాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థినులతో కలిసి ఆమె కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. చదువుకునే వయసులో చిన్న చిన్న పొరపాట్లు చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థికి దేశంలోని చట్టాలపై ప్రాథమిక అవగాహన ఉండాలని ఆమె సూచించారు. చట్టాల పట్ల అవగాహన ఉంటే తప్పులు జరగకుండా జాగ్రత్త పడొచ్చని ఆమె అభిప్రాయపడ్డారురాష్ట్ర విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పుల గురించి కూడా మంత్రి ప్రస్తావించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు.

# జైల్లో ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఊరట మంతెన ఆశ్రమానికి వెళ్లేందుకు అనుమతి



**అమరావతి:** వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కి విజయవాడ ఏసీబీ కోర్టులో ఊరట దక్కింది. మంతెన ఆశ్రమానికి వెళ్లేందుకు అనుమతి లభించింది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెన్నునొప్పితో బాధపడుతున్నారు. తన వెన్నునొప్పి సమస్యకు మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమంలో ప్రకృతి వైద్యం చేయించుకోవడానికి అనుమతి కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ అనంతరం, కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. చికిత్స కోసం వెళ్లిన రోజు నుంచి 15 రోజుల పాటు ఆయన ఆశ్రమంలో ఉండవచ్చని కోర్టు తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతి మంజూరు చేయడంతో.. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని మంతెన ఆశ్రమంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రకృతి చికిత్స చేయించుకోనున్నారు. అంతేకాదు లిక్కర్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న అనిల్ చోఖ్రా తాగేందుకు వేడినీళ్లు అందించాలని జైలు అధికారుల్ని ఏసీబీ కోర్టు ఆదేశించింది. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏపీలో సంచలనం రేపిన మద్యం కేసులో అరెస్ట్ అయ్యారు.. ఆయన ప్రస్తుతం విజయవాడ జైల్లో ఉన్నారు.చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆస్తుల జప్తునకు అనుమతిగత ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించింది. ఈ కేసులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్ట్ అయ్యారు.. విజయవాడ జైల్లో ఖైదీగా ఉన్నారు. అంతేకాదు రెండు నెలల క్రితం ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం చెవిరెడ్డి భాస్కర్?రెడ్డితో పాటు ఆయన కుటుంబ ఆస్తుల జప్తునకు అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటుగా.. ఆయన కుమారులు మోహిత్ రెడ్డి, హర్షిత్‌రెడ్డి పేరిట ఉన్న ఆస్తుల జప్తునకు ఆదేశాలు ఇచ్చారు. చెవిరెడ్డి లక్ష్మి పేరిట ఉన్న కేవీఎస్ ఇన్‌ఫ్రా ఉంది.. ఈ మేరకు ఆ సంస్థల ఆస్తుల జప్తునకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు నెల్లూరు, తిరుపతి, ఆదేశించారు. అవినీతి నిరోధక, నేర చట్టాల సెక్షన్ల ప్రకారం జప్తునకు అనుమ తించారు. ఏపీ ప్రభుత్వం సిట్ విజ్ఞప్తి మేరకు చెవిరెడ్డి కుటుంబ ఆస్తుల జప్తునకు ఆదేశాలు జారీ చేసింది. డీజీపీ తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించగా.. హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్? విశ్వజిత్? ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే

# కృష్ణా జిల్లా పరిధిలో అక్రమంగా గంజాయి తరలింపు ఇద్దరి అరెస్ట్



**కృష్ణా జిల్లా, జనవరి 24:** గంజాయి అక్రమ రవాణాపై కృష్ణా జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి తాజాగా.. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 171.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు మీడియా ముందు ప్రవేశపెట్టి.. కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 23న చిన్నవుటపల్లి సమీపంలో చేపట్టిన వాహన తనిఖీల్లో ~ూ 39 4715 నంబర్ ప్లేట్ గల వ్యాన్?లో గంజాయి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్టు వివరించారు.నిందితులు హనుమంత దుర్గా ప్రసాద్(38), సయ్యద్ ముబారక్(36)గా గుర్తించామన్నారు ఎస్పీ. వారి నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లనూ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన నిఘా పెట్టామని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ విద్యాసాగర్ హెచ్చరించారు.గంజాయి మాఫియాపై జిల్లాలో ముమ్ దాడులు చేపడుతోంది జిల్లా పోలీస్ యంత్రాంగం. ఈ దాడుల్లో గన్నవరం ప్రాంతంలో ఇటీవల 112 కిలోల గంజాయి పట్టుబడిన విషయం తెలిసిందే. గత డిసెంబర్?లో.. ఒడిశా నుంచి పుణేకు తరలిస్తుండగా గన్నవరం పీఎస్ పరిధిలోని బీబీగూడెం అండర్ పాస్ వద్ద వాహన తనిఖీల్లో ఈ గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సరకు విలువ సుమారు రూ.5.60 లక్షలుగా ఉంటుందని తెలిపారు. ఆ ఘటనలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు.

# బీఎంసీ మేయర్ ఎన్నిక వాయిదా గ్రూప్ రిజిస్ట్రేషన్ గందరగోళం

**ముంబై:** బృహాన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికకు చివరి నిమిషంలో అవాంతరం తలెత్తింది. దీంతో జనవరి 31న జరగాల్సిన మేయర్ ఎన్నిక ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా పడింది. బీజేపీ, షిండే సారథ్యంలోని శివసేన గ్రూప్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ముంబై మేయర్ పదవి కోసం బీజేపీ, షిండే శివసేన పోటీ పడుతున్న నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. బీఎంసీ మేయర్ పోస్టును లాటరీ పద్ధతిలో మహిళకు కేటాయించారు. జనవరి 31న ఓటింగ్? జరగాల్సి ఉంది. అయితే, బీజేపీ, శివసేన కార్పొరేటర్లు గ్రూప్ రిజిస్ట్రేషన్లను ఫైనలైజ్ చేయకపోవడంతో మేయర్ ఎన్నికల ప్రక్రియలో అవాంతరం తలెత్తిందది. పోటీలో ఉన్న కూటములన్నీ భాగస్వామ్య ఒప్పంద పత్రాలను మున్సిపల్ సెక్రటరీ కార్యాలయంలో సమర్పించడం తప్పనిసరి. అంతవరకూ ఎన్నికల ప్రక్రియను చేపట్టే వీలుండదు. ఉద్ధవ్ శివసేన-ఎంఎన్ఎస్ కూటమికి చెందిన 65 మంది కార్పొరేటర్లు



రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. బీజేపీ-షిండే కూటమి ఇంకా పేపర్ వర్క్ పూర్తి చేయకపోవడంతో ఫిబ్రవరి మొదటి వారానికి మేయర్ ఎన్నిక వాయిదా పడింది. దీంతో ఉమ్మడి గ్రూపుగా రెండు పార్టీలు రిజిస్టర్ చేయించుకుంటాయా, వేర్వేరుగా రిజిస్టర్ చేయించుకుంటాయా అనేది ఆసక్తికరంగా మారిందిబీఎంసీలో మూడు దశాబ్దాలపాటు సాగిన ఠాక్రేల పట్టుకు ఇటీవల జరిగిన మహారాష్ట్ర పురపోరులో బీజేపీ-షిండే శివసేన గండి కొట్టాయి. 29 మున్సిపల్ కార్పొరేషన్లలో 25 కార్పొరేషన్లను మహాయుతి కూటమి దక్కించుకుంది. ప్రధానంగా 227 మంది సభ్యుల బీఎంసీలో మెజారిటీ మార్క్ 114 కాగా, బీజేపీ-శివసేన కూటమి 118 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 89, శివసేన 29 సీట్లు గెలుచుకోగా, శివసేన యూబీటీ-ఎంఎన్?ఎస్ కూటమి (65o6) 71 సీట్లు సాధించాయి. కాంగ్రెస్ 24 సీట్లు, ఏఐఎంఐఎం 8 సీట్లు దక్కించుకున్నాయి.

# 61 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, జనవరి 24:** దేశవ్యాప్తంగా(శనివారం) జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ. మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రిత్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా నియమితులవుతున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు.బీఎస్ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే



పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాం డెంట్ నాయకత్వం వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిం చడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు.ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.

# ట్రంప్ వ్యాఖ్యలు కొత్తవేం కాదు- దేనికైనా మేం రెడీ


**ఇరాన్ :** ఇరాన్‌ను నాశనం చేస్తానని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఆ దేశ ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మజీద్ హాకీం ఇలాహీ మండిపడ్డారు. ట్రంప్ వ్యాఖ్యలు కొత్తవి కాదని, అయినా దేనికైనా తాము సిద్ధంగా ఉన్నట్లు భారత్‌లో ఉన్న ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఓ వార్తసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వ్యాఖ్యలు చేశారు. తనపై హత్యకు పాల్పడితే ఇరాన్‌ను అమెరికా నాశనం చేస్తుందని ఇటీవల ట్రంప్ వ్యాఖ్యానించారు.'మేం శాంతి, భద్రత కోరుకుంటున్నాం. కానీ కొందరు ఈ పరిస్థితిని సృష్టించారు. దీని వల్ల మొత్తం పశ్చిమాసియా నాశనం అవుతోంది. అన్ని దేశాలు ప్రభావితమవుతాయి. ఇరాన్ శత్రువులు బయట నుంచి యువతను రెచ్చగొడుతున్నారు. అందుకే అంతర్జాతీయ ఇంటర్నెట్‌ను తాత్కాలికంగా నిలిపేశాం. స్థానిక ఇంటర్నెట్ మాత్రం పనిచేస్తోంది. సోషల్ మీడియాను పూర్తిగా నియంత్రించ డం చాలా కష్టం. ఇరాన్?కు అనేక శత్రువులు ఉన్నారు. 250కి పైగా ఛానళ్లు 24 గంటలూ ఇరాన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయి' అని డాక్టర్ అబ్దుల్ మజీద్ తెలిపారునిరసనకారులు ఇతర దేశాల నుంచి వచ్చారా అని ప్రశ్నకు వారు ఇరాన్ పౌరులే అని అబ్దుల్ బదులిచ్చారు. కానీ వారు హింసకు పాల్పడుతున్నారని అన్నారు. వారు విదేశాల్లో లేదా ఇరాన్‌లో చదువుకుంటున్నారు. సోషల్? మీడియా ద్వారా అమాయక ప్రజలకు చంపడానికి, ఆసుపత్రులు, మసీదులు, గ్రంథాలయాలను తగలబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. కొంతమంది నిరసనకారులు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకున్నారు. చాలామంది తమ దుకాణాల్లో, ఆసుపత్రుల్లో, మసీదుల్లో పనిచేస్తున్న అమాయక ప్రజలు. వారిని



ఈ నిరసనకారులే చంపారు. కొందరు నిరసనకారులు పోలీసులపై దాడి చేశారు. పోలీసులు వారిని ఆపే ప్రయత్నంలో మృతిచెందారు' అని మజీద్ ఇలాహీ తెలిపారు.'ఆ సంస్థలు బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తించాలి'ఐక్యరాజ్య సమితి అత్యవసర సమావేశంపై డాక్టర్ అబ్దుల్ మజీద్ స్పందించారు. కొన్ని అంతర్జాతీయ సంస్థలు ప్రపంచంలో తమ ప్రభావాన్ని కోల్పోయాని తెలిపారు. మరికొన్ని సంస్థలు కొన్ని దేశాల చేతుల్లోనే ఉన్నాయని చెప్పారు. అవి తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, ప్రజలు, దేశాల ప్రయోజనాల కోసం పనిచేస్తాయని తాము ఆశిస్తున్నామని అన్నారు. ఇరాన్ పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి జనవరి 23న ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది.'అణ్వాయుధాలను అభివృద్ధి చేయాలని ఇరాన్‌కు లేదు'ఇక ఇరాన్ అణు కార్యక్రమంపై కూడా అబ్దుల్ మాజీద్ మాట్లాడారు. ఇరాన్ ఎప్పుడూ అణ్వాయుధాలను అభివృద్ధి చేయాలనుకోలేదని పేర్కొన్నారు. శాంతియుత అణు శక్తికే కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా సయ్యద్ అలీ ఖమేనీ జారీ చేసిన ఫత్వా ప్రకారం అణ్వాయుధాలు కలిగి ఉండటం వినియోగించడం నేరం. అందుకే ఇరాన్ అణ్వాయుధాలను ఎప్పుడూ కోరుకోలేదు. అయితే శాంతియుత అవసరాల కోసం అణు సాంకేతికతను అభివృద్ధి చేసుకునే హక్కు ఇరాన్‌కు ఉంది. సామాజిక అభివృద్ధి, మానవతా అవసరాలు, వైద్య చికిత్సలు, శక్తి ఉత్పత్తి కోసం శాంతియుత అణు శక్తిని కలిగి ఉండాలని ఇరాన్ కోరుకుంటుంది' అని అబ్దుల్ మజీద్ తెలిపారు.మరోవైపు అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంటోంది. భారీ స్థాయిలో అమెరికా సైన్యం ఇరాన్ దిశగా కదులుతోందని ట్రంప్ వెల్లడించారు. ఏమీ జరగకుండా ఆపడమే తనకు ఇష్టమని, తాము ఇరాన్‌ను చాలా నిశితంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక నిరసనకారులను చంపడాన్ని ఇక ఆపాలని తెలిపారు. . అలాగే అణ్వస్త్ర కార్యక్రమాన్ని మళ్లీ మొదలుపెట్టాలనే ఆలోచనను కూడా పక్కనపెట్టాలని ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు తమ వేలు ట్రిగ్గర్‌పైనే ఉందని ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్(ఐఆర్‌జీసీ) హెచ్చరించింది.

# చైనా మిమ్మల్ని తినేస్తుంది కెనడాకు ట్రంప్ హెచ్చరిక


**అమెరికా:** మిసైల్ రక్షణ వ్యవస్థ గోల్డెన్ డోమ్ ఏర్పాటు ప్రతిపాదనలను కెనడా వ్యతిరేకిస్తుండటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదోక రోజు కెనడా చైనాకు బలైపోతుందని వ్యాఖ్యానించారు. చైనాతో దౌత్య, వాణిజ్య బంధాల బలోపేతానికి కెనడా ప్రయత్నిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ హెచ్చరిక చేశారు.'గ్రీన్‌లాండ్‌కు రక్షణగా గోల్డెన్ డోమ్ ఏర్పాటును కెనడా వ్యతిరేకిస్తోంది. కెనడాకూ ఈ వ్యవస్థతో రక్షణ లభించే అవకాశం ఉన్నా అడ్డుకుంటోంది. ఇది చాలదన్నట్టు వారు చైనాతో వాణిజ్యానికి మొగ్గుచూపుతున్నారు. ఒప్పందం కుదిరిన మొదటి సంవత్సరంలోనే వారు చైనాకు ఆహారమైపో తారు' అని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ హెచ్చరించారు.కెనడా, అమెరికాల మధ్య కొంత కాలంగా అసలేమాత్రం పొసగని విషయం తెలిసిందే. ఇక దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశాల్లో ఇరు దేశాల మధ్య ఎడం మరింత పెరిగింది. ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వ తీరును కెనడా ప్రధాని కార్నీ



ఎండగట్టారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ నియమాలకు కాలం చెల్లినట్టు కనిపిస్తోందని అన్నారు.దీంతో, ట్రంప్ కూడా అంతేఘా టుగా స్పందించారు. ఇంతకాలం అమెరికా ఇచ్చే అనేక ఉచితాలను అనుభవించిన కెనడా కాస్తంత కృతజ్ఞతతో మసులుకోవాలని అన్నారు. కానీ వారిలో కృతజ్ఞత కనిపించట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తను ప్రతిపాదించిన గోల్డెన్ డోమ్‌తో కెనడాకు కూడా రక్షణ లభిస్తుందని అన్నారు.ఏమిటీ గోల్డెన్‌డోమ్ ప్రాజెక్టు.మిసైల్ దాడుల నుంచి రక్షణ కోసం అమెరికా ప్రభుత్వం గతేడాది తొలిసారిగా ఈ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ ఏర్పాటు చేసుకున్న ఐరోన్ డోమ్ వ్యవస్థ స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. మొదట్లో దీన్ని ఐరన్ డోమ్ ఆఫ్ అమెరికాగా మీడియాలో పేర్కొన్నప్పటికీ ఆ తరువాత ప్రభుత్వం గోల్డెన్ డోమ్‌గా పేరు మార్చింది. ఇందుకు అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని కెనడా ప్రభుత్వం భరిస్తే ఆ దేశానికి రక్షణ కల్పిస్తామని తెలిపింది. అమెరికా భద్రతకు గ్రీన్‌లాండ్ కీలకంగా మారిందని చెబుతున్న ట్రంప్ అక్కడకు కూడా గోల్డెన్ డోమ్ రక్షణను విస్తరిస్తామని చెబుతున్నారు.అయితే, కెనడా మాత్రం ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. గోల్డెన్ డోమ్ ప్రతిపాదన తమ ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేలా ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. చైనాతో వాణిజ్య సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు కూడా కెనడా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ అనుసరిస్తున్న విధానాలను కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

# బంగాల్‌లో హడావుడిగా సామాన్యులు ఓటు హక్కు కోల్పోయే ఛాన్స్:

**బంగాల్:** బంగాల్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ (92 ఏళ్లు) తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరికొద్ది నెలల్లో బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో, ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత వేగంగా, హడావుడిగా, అనవసర తొందరపాటుతో నిర్వహిస్తున్నారని, దీని వల్ల ప్రజాస్వామ్య భాగస్వామ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. బోస్టన్ నుంచి ఓ ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఓటర్ల జాబితా సవరణ అనేది చాలా పారదర్శకంగా, తగినంత సమయం కేటాయించి చేయాల్సిన ప్రక్రియ. కానీ బంగాల్‌లో ప్రస్తుతం ఎస్ఐఆర్ జరుగుతున్న తీరు చూస్తుంటే, అది చాలా



లోపభూయిష్టంగా కనిపిస్తోంది. ఓటర్లు తమ అర్హతలను నిరూపించుకోవడానికి అవసరమైన పత్రాలను సమర్పించేందుకు తగినంత సమయాన్ని ఎన్నికల అధికారులు ఇవ్వడం లేదు. ఇది ఓటర్లకు అన్యాయం చేయడమే అవుతుంది. అంతేకాదు ఇది భారత ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసే అవకాశం ఉంది."- అమర్త్యసేన్, ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీతమా అమ్మ వయస్సు గురించి అడిగారు!ఎస్?ఐఆర్? నిర్వహిస్తున్న ఎన్నికల అధికారుల తీరును అమర్త్యసేన్ ఎండగట్టారు. "కొన్ని సార్లు ఎన్నికల సంఘం అధికారులకే తగినంత సమయం లేనట్లు అనిపిస్తోంది" అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన తన సొంత అనుభవాన్ని పంచుకున్నారు. "నా సొంత నియోజకవర్గం లరికార్డుల్లో ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు నా అర్హతలపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. నా పుట్టిన తేదీ నాటికి మా దివంగత అమ్మగారి వయస్సు ఎంత అని అడిగారు. వాస్తవానికి మా అమ్మ కూడా ఓటరుగా ఉంటే, ఆమె వివరాలు వారి వద్దే ఉంటాయి కదా" అని అమర్త్యసేన్ ప్రశ్నించారు.

# గవర్నర్ పదవిని ఆర్ఎన్ రవి అవమానిస్తున్నారు గతంలో ఆయనలా ఎవరూ లేరు



**తమిళనాడు :** అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో ప్రసంగాన్ని చదవకుండా గవర్నర్ ఆర్ఎన్ రవి తన పదవిని అవమానించారని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆరోపించారు. ఆయన చర్యలను విమర్శించక తప్పడం లేదని, గతంలో తమిళనాడుకు వచ్చిన గవర్నర్లు ఎవరూ రవిలా లేరని అన్నారు. దేశభక్తి తమకు గౌరవం ఉందని, ఎవరూ పాఠాలు నేర్పించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'సమావేశాల ప్రారంభంలో ప్రసంగం చదవకపోవడం ద్వారా గవర్నర్ తన పదవిని అవమానిస్తున్నారు. గవర్నర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ఆ ఒక్క కారణాన్ని చెప్పి పదే పదే అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నారు. దేశం, జాతీయ గీతం పట్ల మాకు గౌవరం ఉంది. ఈ విషయంలో ఎవరూ పాఠాలు నేర్పించాల్సిన అవసరం లేదు. మాజీ ముఖ్యమంత్రులు సీఎన్ అన్నాదురై, ఎం కురణానిధి, ఎంజీఆర్, జయలలిత హయాంలో చూడని సంక్షోభాన్ని నేను ఎదుర్కొంటున్నా. ఇదేం నాకు కొత్త కాదు. గతంలో నేను అనేక సవాళ్లను ఎదుర్కొని వాటిని అధిగమించా' అని ఎంకే స్టాలిన్ అన్నారు.

# పంజాబ్‌లో ఉగ్రవాద కుట్ర భగ్నం.. భారీఎత్తున ఆయుధాలు స్వాధీనం



**పంజాబ్ :** గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశవ్యాప్తంగా ఉగ్ర ముప్పుఉందని ఇటీవల ఇంటెలిజెన్స్ బ్యూరో రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే పంజాబ్ పోలీసులు భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేశారు. పంజాబ్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ ఆపరేషన్?లో నిషేధిత ఉగ్రసంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ కి చెందిన టెర్రర్ మాడ్యూల్?ను గుర్తించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పెద్దఎత్తున భయాందోళన సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు పంజాబ్ డీజీపీ తెలిపారు.నిందితుల వద్ద నుంచి 2.5 కిలోల ఆర్డీఎక్స్ తో తయారు చేసిన ఒక ఇంప్రొవైజ్డ్ ఎక్స్ ప్లోసివ్ డైవైస్, రెండు గన్స్, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉగ్ర మాడ్యూల్ అమెరికా లో ఉన్న హ్యాండ్లర్లు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై చట్ట విరుద్ధ కార్యకలాపాల చట్టం, పేలుడు పదార్థాల చట్టానికి సంబంధించిన పలు సెక్షన్ల కింద హోషియార్?పూర్?లోని గర్శంకర్ పోలీస్ స్టేషన్?లో కేసు నమోదు అయ్యింది. ప్రస్తుతం దీనిపై పూర్తి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

# అహ్మదాబాద్ విమానం దుర్ఘటన ఎయిరిండియాకు రూ.1,100 కోట్ల బీమా సొమ్ము



**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్‌లో గత ఏడాది జూన్ 12న ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటన తీవ్ర సంచలనమైంది. ఈ ఘటనలో విమానంలోని 241 మంది ప్రయాణికులతో సహా మొత్తం 260 మంది మృతి చెందారు. ఈ ప్రమాద ఘటనలో ఎయిరిండియాకు పలు బీమా కంపెనీలు, రీఇన్సూరర్ల నుంచి తాజాగా పరిహారం అందింది. ఎయిరిండియాకు 125 మిలియన్ డాలర్లు (రూ.1,100 కోట్లకు పైగా) పరిహారం చెల్లించినట్టు బీమా వర్గాలు తెలిపాయి.ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు 25 మిలియన్ డాలర్లు (రూ.225 కోట్లు) పరిహారంగా చెల్లించినట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. పరిహారం పంపిణీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని, ఆ మొత్తం పెరిగే అవకాశం ఉంది తెలిపాయి.గత ఏడాది అహ్మదాబాద్ నుంచి లండన్?కు బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్?లైనర్ విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే కుప్పకూలింది. మెడికల్ కాలేజీ హాస్టల్?పై పడటంతో విమానంలోని 242 మందిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. గ్రౌండ్?లోని మరికొందరితో కలిపి మృతుల సంఖ్య 260 మందికి చేరింది. మృతుల్లో 169 మంది ఇండియన్లు, 53 మంది బ్రిటన్ పౌరులు, ఏడుగురు పోర్చుగల్ వాసులు, ఒక కెనడియన్ ఉన్నారు. విమానంలోని ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బంది సైతం ప్రాణాలు కోల్పోయారు.

# దాల్ గేట్ గెస్ట్ హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం

**శ్రీనగర్ :** శ్రీనగర్‌లోని దాల్‌గేట్ తీరాన ఉన్న గెస్ట్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారమందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువస్తున్నారు. ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్ కమాండ్ వివరాల ప్రకార ం. ప్రాథమిక అంచనా ప్రకారం దాల్ ఫాగ్ అనే మూడు అంతస్థుల గెస్ట్ హౌస్‌లో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. భారీగా నష్టం సంభవిం చింది.



ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది తక్కువ సమయంలో మంటలను అదుపులోకి తీసుకువచ్చింది.షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలగా.. అగ్నిప్రమాదానికి గల కారణాలపై విశ్లేషించేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్టు పేర్కొంది. ఘటనా స్థలంలో ఏవైనా డెడ్‌బాడీలు కానీ.. ఇతర మండే పదార్థాలు కానీ ఉన్నాయా.. అని తెలుసుకునే స్పెషల్ డాగ్ స్క్వాడ్ టీం పరిశీలిస్తుందని.. ఇప్పటివరకు ఒకరికి గాయాలయినట్టు నిర్ధారణ అయిందని.. ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని పేర్కొంది.

# తల్లిదండ్రులూ.....తస్మాత్ జాగ్రత్త !

భారతీయ విద్యావిధానం మనిషి మేధావిని భాషించేలా..ప్రపంచాన్ని శాసించేలా ఉండేది. అన్నిరంగాల్లో విద్యార్థులను ఆరితేరేలా చేసే మన విద్యావిధానం పాతపడి పోయింది. ఎందుకంటే దానిని పాతరేశారు. బ్రిటిషర్ల హయాంలో మెకాలే విద్యావిధానంతో మన విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. అందుకే సమాజం లో నైపుణ్యత, నాణ్యత లేని విద్యను గడిస్తున్న విద్యార్థులు కోకొల్లలుగా పుట్టుకు వస్తున్నారు. వారికి నైపుణ్యాలు లేక ఎక్కడా రాణించడం లేదు. ఒళ్లు వంచి పనిచేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో మనదేశంలో కోటళ్లల్లో నిరుద్యోగులు పెరిగి పోతున్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో అవకాశాలు దండిగా ఉన్నా..బిటెక్, ఎంటెక్‌లు చదివిన వారంతా ఇలాంటి పనులకు రాలేకపోతున్నారు. చదువు వేరు వృత్తి వేరు అన్న విధంగా ఆలోచించే ధోరణి కానరావడం లేదు. భారతీయుల మేధస్సు అమోఘం, అద్భుత మని ప్రపంచం ఎప్పుడో గుర్తించింది. ఇప్పటికీ విదేశాల్లో రాణిస్తున్నది కూడా మనవారే. ముఖ్యంగా ఇంగ్లీష్, మ్యాథ్, సైన్స్ తదితర రంగాల్లో అద్భుత ప్రదర్శనను కనబరుస్తున్నాం. అయితే ఈ దిశగా మానవనరులను అభివృద్ధి చేసుకునేలా విద్యావిధానం రావడం లేదు. సమాజంలో విలువలు పడిపోవడానికి, యువతలో నైపుణ్యాలు లేకపోవడం కూడా విద్యావిధాన లోపంగానే గుర్తించాలి. అత్యాధునిక ఫోన్లు, ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థుల్లో నైపుణ్యత కొరవడింది. ప్రతిదానికి గూగుల్‌లో వెతికేస్తున్నారు. అలాగే గంటలతరబడి సెల్ ఫోన్లకు అతుక్కు పోతున్నారు. అలవాట్లో భాగంగా యువత పోర్న్ వీడియోలు తిలకి స్తున్నారు. జూదాలకు బానిసలు అవుతున్నారు. అర్థాంతరంగా తనువులు చాలిస్తున్నారు. నిజానికి ఇదో సామాజిక రుగ్మత. దీనిని మార్చాలంటే అక్షరాభ్యాసం నుంచే క్రమశిక్షణ అలవర్చాలి. విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. విలువలతో కూడిన విద్యను నేర్పాలి. లేకుంటే మరింతగా సమాజం దెబ్బతినగలదు. ఎందుకంటే ప్రస్తుతం పిల్లలంతా సెల్ ఫోన్లకు



అలవాటు పడ్డారు. చిన్న పిల్లవాడిని బుజ్జగించడానికి, అన్నం పెట్టడానికి కూడా సెల్ ఫోన్ వాడేస్తున్నాం. దీంతో పిల్లల్లో మానసిక పరిపక్వత లోపించి, తరగతి గదిలో పరధ్యానంగా వుండిపోతున్నారు. ఆటస్థలంలోనూ నిశ్శబ్దంగా వుంటున్నారు. చురుకుగా, రాటులేదలే కపోతున్నారు. పాఠాలు ఇప్పుడు చాలా చోట్ల స్క్రీన్ల మీద చెబుతు న్నారు. పిల్లలు వీటిని చూస్తూ టీచర్ల వైపు చూడ్డమే మానేశారు. వారితో సంభాషించడం లేదు. పరస్పర అవగాహన లోపిస్తోంది. దీంతో పిల్లలు టీచర్లు ఒకరికి ఒకరు దూరమైపోతున్నారు. తీరిక సమయాల్లో పిల్లలు వాళ్లలో వాళ్లు కూడా మాట్లాడు కోవడం మానేస్తున్నారు. ఇప్పటి పిల్లలది ఏదో ఒక కొత్త లోకమనిపిస్తోంది. మన కుర్రకారు యవ్వనమంతా అశాంతి, చిరాకు, ఆందోళన, ఒంటరి తనాలతో నిండిపోతోంది. తరగతి గది, బడి వాతావరణమంతా యాంత్రికంగా మారింది. పుస్తకాలూ చదవకుండా, గ్రంధపఠనం లేకుండా, పరిసరాల పై అవగాహన లకుండా, చుట్టూ ఏం జరుగుతుందో తెలియకుండా చదివేసి పట్టాలు పుచ్చుకుంటున్నారు. మన తినే అన్నం ఏ ధాన్యం



ద్వారా వస్తుందో కూడా తెలియడం లేదు. పాలు ఎలా వస్తాయో తెలియడం లేదు. సెల్‌ఫోన్ పిచ్చిలో పడి మనిషికి మనిషికీ మధ్య అనుబంధాన్ని కోల్పోతున్నారు. నిజానికీ దేశంలోని పిల్లలందరికీ విజ్ఞానం దక్కాలి. వాళ్ల సామర్థ్యాలన్నీ వెలికి రావాలి. వారి మేధస్సుకు పదును పెట్టాలి. ఇవన్నీ కూడా పాఠశాలలో బోధనా తీరుతో..అదికూడా మన ప్రాచీన పద్దతుల ద్వారానే సాధ్యం అవుతుంది. దీనికి ప్రభుత్వాలదే ప్రధాన బాధ్యత. పాలకుల ఓటు బ్యాంక్ రాజకీయాలకు విద్యావ్యవస్థ బలయిపోతోంది. చిన్ననాటి నుంచే కులాల కుంపట్లను రాజేస్తున్నాం. ఇక కులరహిత సమాజం ఎక్కడ పోతుందన్న ఆలోచన చేయడం లేదు. మనం మన పిల్లలకు కావలసిందంతా ఇస్తున్నామనుకుంటున్నాం. విస్తృత ప్రపంచాన్ని వారి ముందు తెరిచి పెడుతున్నామనుకుంటున్నాం.కానీ అది ఎలాంటి విపరిణామాలకు దారితీస్తున్నదో గ్రహిచడం లేదు. నగరాల్లో ఉన్న సెంట్రల్ సిలబస్, కేంబ్రిడ్జ్ వంటి స్కూళ్లతో పోల్చుకుంటే ఇప్పటికీ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే కొంత జనరలం నాలెడ్జ్ అబ్బుతోంది. సెల్‌ఫోన్ కారణంగా మన పిల్లలు మానసిక రుగ్మతకు లోనవుతున్నారు. దీనికితోడు పిజ్జాలు, బర్గర్లు, చిప్స్, కూల్ డ్రింక్స్ లాంటి చెత్త తిండి వల్ల ఊబకాయం పెరిగి అనేక రకాల రోగాలు చేరుతున్నాయి. టీనేజర్లలో ఆత్మహత్యా ప్రయత్నాలు పెరిగాయి. ఒక అధ్యయనం ప్రకారం ప్రతి ముగ్గురు బిడ్డల్లో ఒకరికి కంటి సమస్య తలెత్తు తోంది. ఒకరకంగా ఇదంతా మనం తెచ్చిపెట్టుకున్న సమస్య. ఎక్కువ కాలం ఫోన్లపై గడపడం, బ్లూ లైట్లు, నిద్ర లేమి, ఆటల కొరత ఇవన్నీ మనం కోరి తెచ్చుకొన్న ఉపద్రవాలు. కంటి జబ్బులతో ఇది ఆగడం లేదు. ఈ ఫోన్ల పుణ్యమా అని మన పిల్లలు డ్రగ్స్ బారిన పడుతున్నారు. హింసాత్మకంగా మారుతున్నారు. పోర్న్ వీడియోలకు బానిసలవుతున్నారు. వారి ప్రవర్తనలో తీవ్రమైన మార్పులొస్తున్నాయి. బస్సుల్లో, రైళ్లలో ప్రయాణించే మన చంటిపిల్లలు కూడా ఫోన్లకు అతుక్కుపోతున్నారు. కిటికీ లోంచి బయటికి చూడ్డం లేదు. అక్కడ వారికే కొత్త లోకమూ కనపడ్డం లేదు. విచిత్రంగా పసిబిడ్డలకు కూడా ప్రపంచం మూసుకుపోతోంది. ఇంతకంటే విషాదం మరోటి ఉండదు. కోవిడ్ రోజుల్లో మనం చెప్పిన ఆన్‌లైన్ పాఠాలు కూడా వారిని మరింతగా ఫోన్లకు బానిసల్ని చేశాయి. మనకు తెలియకుండానే మన పిల్లలు మానసికంగా బలహీనులై పోయారు. టెక్నాలజీ ఏదో గొప్పదనీ, దీన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకందించాలనీ మనమనుకుంటే అది పిల్లల్ని బడికి, కుటుంబానికి, చివరకు స్వతంత్ర ఆలోచనలకు కూడా దూరం చేసింది. ఇప్పుడు కోవిడ్ లేదు. అయినా సెల్ ఫోన్ల జాడ్యం మాత్రం కొనసాగుతోంది. దీనికి దూరం చేయడం కోసం పిల్లల్లో మానసిక పరివర్తనకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. సమతు ఆహారం ఇవ్వాలి. వ్యాయామం, నడకను ప్రోత్సహించాలి. ఇలా మనమంతా మన ప్రాచీన అలవాట్లను ముందుకు తెచ్చుకుంటే తప్ప మనుగడ సాగించడం కష్టం. తల్లిదండ్రులు ఈ బిజీ లైఫ్‌లో పిల్లల మనుగుడ గురించి ఆలోచించడం లేదు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లో వ్యాపారధోరణి పెరిగింది. అందుకే మనమే మారాలి. పిల్లల కోసం సమయం కేటాయించాలి. ఇంటినుంచే మార్పు రావాలి.

# చైనాకు బలైపోతావ్ జాగ్రత్త !

## • కెనడాను హెచ్చరించిన ట్రంప్

**వాషింగ్టన్,జనవరి24:** మిసైల్ రక్షణ వ్యవస్థ గోల్డెన్న్ డోమ్ ఏర్పాటు ప్రతిపాదనలను కెనడా వ్యతిరేకిస్తుండటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదో ఒక రోజు కెనడా చైనాకు బలైపోతుందని వ్యాఖ్యానించారు. చైనాతో దౌత్య, వాణిజ్య బంధాల బలోపేతానికి కెనడా ప్రయత్నిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ హెచ్చరిక చేయడం గమనార్హం. గ్రీన్‌లాండ్‌కు రక్షణగా గోల్డెన్ డోమ్ ఏర్పాటును కెనడా వ్యతిరేకిస్తోంది. కెనడాకూ ఈ వ్యవస్థతో రక్షణ లభించే అవకాశం ఉన్నా అడ్డుకుంటోంది. ఇది చాలదన్నట్టు వారు చైనాతో వాణిజ్యానికి మొగ్గుచూపుతున్నారు. ఒప్పందం కుదిరిన మొదటి సంవత్సరం లోనే వారు చైనాకు ఆహారమైపోతారని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ హెచ్చరించారు. అమెరికా భద్రతకు గ్రీన్‌లాండ్ కీలకంగా మారిందని చెబుతున్న ట్రంప్ అక్కడకు కూడా గోల్డెన్ డోమ్ రక్షణను విస్తరిస్తామని చెబుతున్నారు. అయితే, కెనడా మాత్రం ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. గోల్డెన్ డోమ్ ప్రతిపాదన తమ ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేలా ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. చైనాతో వాణిజ్య సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు కూడా కెనడా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కెనడా, అమెరికాల మధ్య కొంత కాలంగా అసలేమాత్రం పొసగని విషయం తెలిసిందే. ఇక దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశాల్లో ఇరు దేశాల మధ్య ఎడం మరింత పెరిగింది. ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వ తీరును కెనడా ప్రధాని కార్నీ ఎండగట్టారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ నియమాలకు కాలం చెల్లినట్టు కనిపిస్తోందని అన్నారు. దీంతో, ట్రంప్ కూడా అంతేఘాటుగా స్పందించారు. ఇంతకాలం అమెరికా ఇచ్చే అనేక ఉచితాలను అనుభవించిన కెనడా కాస్తంత కృతజ్ఞతతో మసులుకోవాలని అన్నారు. కానీ వారిలో కృతజ్ఞత కనిపించట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తను ప్రతిపాదించిన గో÷-డలెన్ డోమ్‌తో కెనడాకు కూడా రక్షణ లభిస్తుందని అన్నారు. మిసైల్ దాడుల నుంచి రక్షణ కోసం అమెరికా ప్రభుత్వం గతేడాది తొలిసారిగా ఈ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ ఏర్పాటు చేసుకున్న ఐరోన్ డోమ్ వ్యవస్థ స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. మొదట్లో దీన్ని ఐరన్ డోమ్ ఆఫ్ అమెరికాగా మీడియాలో పేర్కొన్నప్పటికీ ఆ తరువాత ప్రభుత్వం గో÷-డలెన్ డోమ్‌గా పేరు మార్చింది. ఇందుకు అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని కెనడా ప్రభుత్వం భరిస్తే ఆ దేశానికి రక్షణ కల్పిస్తామని తెలిపింది.




# అమెరికాను కుదిపేస్తున్నమంచు తుఫాన్

## • ఎమర్జెన్సీ ప్రకటించిన పలు రాష్ట్రాలు
## • 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు వెల్లడి



**వాషింగ్టన్,జనవరి24:** అమెరికాను భారీ మంచు తుపానుతాకింది. దీంతో పలు రాష్ట్రాల్లో భారీస్థాయిలో మంచు, వర్షంతోపాటు అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం టెక్సాస్, ఓక్లహోమాపై మంచు తుపాను పంజా విసురుతోంది. మంచు తుపాను కారణంగా అమెరికాలోని 20 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రభావితం కానున్నట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఈ భీకర తుపాను కారణంగా పలు రాష్ట్రాల్లో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. శనివారం నాటి 3,200 విమాన సర్వీసులు, ఆదివారం నాటి 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు సైలట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. మున్ముందు ఈ పరిస్థితి మరింత తీవ్రతరమయ్యే అవకాశం ఉండడంతో పెద్దసంఖ్యలో రవాణా సర్వీసులకు అంతరాయం కలగొచ్చని అంచనా వేసింది. వాతావరణ హెచ్చరికలతో అమెరికాలోని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కెంటకీ, వర్జీనియా, కాన్సస్, ఆర్కాన్సాస్, జార్జియా, మిసిసిపి సహా పలు రాష్ట్రాలు ఎమర్జెన్సీ విధించాయి. మిసిసిపి, ఫ్లోరిడా వంటి దక్షిణాది రాష్ట్రాల్లోనూ ప్రమాదకర చలి వాతావరణం ఉంటుందని.. మిస్సోరి, ఇల్లినోయిలలోనూ భారీ మంచు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రతికూల వాతావరణం కారణంగా అనేక ప్రాంతాల్లో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడనుందని, వాహనదారులు మంచులోనే చిక్కుకుపోయే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఇది ఈ దశాబ్దిలోనే అతి తీవ్రమైనదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# గణతంత్ర వేడుకల్లో తెలంగాణ ప్రత్యేకత

## పరేడ్‌లో ఒగ్గుడోలు ప్రదర్శనకు అనుమతి
## ఢిల్లీ వేదికగా ప్రాక్టీస్ చేస్తున్న కళాకారులు

**న్యూఢిల్లీ,జనవరి24:** దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది జరిగే 77వ గణతంత్ర వేడుకుల్లో ఈసారి తెలంగాణ బిడ్డలు ప్రత్యేకంగా నిలవబోతున్నారు. రాష్ట్రపతి, ప్రధాని, ఇతర దేశాధిపతుల ముందు తెలంగాణకే సొంతమైన కళారూపాన్ని ప్రదర్శింనున్నారు. ఇప్పటి వరకు ఎన్నో కళారూపాలు రిపబ్లికే డేలో పాల్గొన్నా, తొలిసారి ఒగ్గుడోలు విన్యాసానికి చోటు దక్కింది. ఈ ప్రదర్శన కోసం సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నుంచి ప్రఖ్యాత ఒగ్గు డోలు కళాకారుడు డాక్టర్ ఒగ్గు రవి బృందానికి ఆహ్వానం అందింది. దీంతో ఒగ్గు రవి నేతృత్వంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది కళాకారులు ఈనెల 8నే ఢిల్లీకి చేరుకున్నారు. ఎముకలు కొరికే చలిలో దాదాపు 15 రోజులుగా కర్తవ్యపథ్ పై ప్రాక్టీస్ చేస్తున్నారు. సుమారు వంద మంది కళాకారులు దేశంలోని వివిధ కళారూపాలతో కలిపి, ఏక్ భారత్ అనే కాన్సెప్ట్ తో కళారూపాన్ని ప్రదర్శించనున్నారు. త్రివిధ దళాలు, పారా మిలటరీ



బలగాలు, ఢిల్లీ పోలీస్ కంటింజెట్లకు ఏమాత్రం తీసిపోకుండా, కేవలం తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సిసి విద్యార్థులు ఈసారి కవాతు చేయబోతున్నారు. ఎపి, తెలంగాణ నుంచి మొత్తం 133 మంది పాల్గొంటున్నారు. ఈ టీంను కవాడీ గూడకు చెందిన బీటెక్ మూడో ఏడాది విద్యార్థి భరత్ లీడ్ చేయబోతున్నాడు. డిసెంబర్ 27 న ఢిల్లీ వచ్చిన ఈ టీం దాదాపు నెల రోజులుగా కర్తవ్య పథ్ పై కవాతు చేస్తోంది. భారత గణతంత్ర దినోత్సవాల్లో తొలిసారిగా భారతీయ సినిమా అపూర్వమైన రీతిలో జాతీయ దృష్టిని ఆకర్షించనుంది. ప్రముఖ చలనచిత్ర దర్శకుడు సంజరు లీలా భన్సాలీ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కోసం సినీ శకటాన్ని రూపొందించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ ఉత్సవాల్లో ప్రముఖ సినీ దర్శకుడు ఈ ప్రత్యేక సినీ శకటానికి ప్రాతినిధ్యం వహించడం విశేషం. 'భారత్ గాథ' అనే భావనతో తీసుకువస్తున్న ఈ శకటా నికి కొత్తగా స్వరపరిచిన, ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ ఆలపి ంచిన పాట తోడవుతుంది. జీవన సాంస్కృతిక కథనంగా సినిమా పట్ల భన్సాలీ దార్శనికతకు ఇదొక తార్కాణంగా నిలుస్తుంది.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై,బెల్టు,ఐడి కార్డు ల పంపిణీ చేసిన తడక చంద్రశేఖర్



నిర్మల్ జిల్లా ప్రతినిధి:నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల విన్నపం మేరకు తడక చంద్ర శేఖర్ తన సొంత కార్చు ఖర్చులతో విద్యార్థిని,విద్యార్థులకు టై,బెల్ట్, ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వన్నెల సాయన్న ,మాజీ వీడీసీ అధ్యక్షులు పోశెట్టి , (ఏఎంసీ ) డైరెక్టర్ అహ్మద్ ముక్తార్ పాఠశాల ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

## ఆన్లైన్ బెట్టింగ్ లో మోసపోయి యువకుడు మృతి





జనవరి 24 నిర్మల్ జిల్లా ప్రతినిధి//నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం ఆన్లైన్ బెట్టింగ్ లో మోసపోయి యువకుడు మృతి చెందిన సంఘటన సారంగాపూర్ మండలం లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రానాపూర్ తండా కు చెందిన జాదవ్ ప్రేమ్ కుమార్ (39) ఫర్టిలైజర్ వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగుతున్న క్రమంలో ఆన్లైన్ బెట్టింగ్లకు అలవాటు పడి 70 లక్షలు పోగొట్టుకున్నాడు అప్పులు ఎక్కువ అవడంతో వ్యాపారం దివాలు తీసింది. దీంతో మనస్థాపం చెంది శుక్రవారం మధ్యాహ్నం చించోలి బి మైనార్టీ స్కూల్ వెనుక భాగంలో ఆత్మహత్య పాల్పడి శవమై కనిపించాడు. మృతుడి చేయి మణకట్టు కోసినట్టు ప్రక్కన పురుగుల మందు డబ్బా ఉన్నట్లు దృశ్యాలు కనిపించాయి. మృతుడి తండ్రి జాదవ్ తారా చంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## రోడ్డు నియమాలపై ఆవగాహన

**హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడండి**
**బాసర ఎస్సై నవనీత రెడ్డి**




జనవరి 24 ( బాసర ) :నిర్మల్ జిల్లా :- బాసరలో రోడ్డు నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని బాసర ఎస్సై నవనీత రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు శనివారం బాసర మండలంలోని వాహనదారులకు,గ్రామస్తులకు డిఫెన్సివ్ డ్రైవింగ్ పై అవగాహన కల్పించారు.రోడ్డు పై డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పరిసరాలను ముందుగానే గమనించాలన్నారు. డిఫెన్స్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఎదుటివారి తప్పిదాలను తప్పనిసరిగా డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. దీంతో ప్రమాదల నుండి రక్షించుకోవచ్చన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డిఫిన్సి డ్రైవింగ్ పై ప్రతి ఒక్క డ్రైవర్ కు అవగాహన కల్పిస్తామన్నారు.ముఖ్యంగా మైనర్ బాలులకు ద్విచక్ర వాహనాలు విస్తే చట్టపరం గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అలా తల్లిదండ్రులను కేసు నమో చేస్తామని తెలియజేశారు . ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడండి. ఫోర్ వీల్ వాహనదారులు సీట్ బెల్ట్ వాడాలని తెలియజేశారు. ఎందరో ప్రజలు యాక్సిడెంట్లు తమ అమ్మ నాన్నను.తమ భార్య పిల్లలను విడిచి వెళ్ళిపోతున్నారని తెలియజేశారు కార్యక్రమంలో. పోలీస్ సిబ్బంది బాసర గ్రామస్తులు. వాహనదారులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామంలో నెలకొన్న సమస్యలు తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం

**బాసర సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్**



జనవరి 24 ( బాసర ) నిర్మల్ జిల్లా :- బాసర మండల కేంద్రంలో గ్రామ ప్రజల తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, విద్యుత్ సరఫరా సరిగ్గా లేక మోటార్లు నడవక పోవడంతో ఎదురవుతున్న సమస్యను గ్రామస్తులు ఇటీవల సర్పంచ్ గారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన సర్పంచ్ గారు, విద్యుత్ శాఖ ఏఈ (AE) గారితో మాట్లాడి సమస్యను వివరించారు. ఈ క్రమంలో, విన్నపం అందిన 10 రోజుల వ్యవధిలోనే బాసరలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయం వద్ద నూతన ట్రాన్స్?ఫార్మర్?ను ఏర్పాటు చేయించి, శనివారం దానిని ప్రారంభించారు. సమస్య ఏదైనా, అడిగిన వెంటనే స్పందిస్తూ. మాట ఇచ్చిన పది రోజుల్లోనే ట్రాన్స్?ఫార్మర్ ఏర్పాటు చేయించి తన చిత్తశుద్ధిని చాటుకున్న సర్పంచ్ గారి తీరుపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'మేము ఎన్నుకున్నది కేవలం నాయకుడిని కాదు, నిబద్ధత గల ఒక నిజమైన సేవకుడిని' అంటూ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ అనిల్. వార్డ్ మెంబర్స్ గ్రామస్తులు ఉన్నారు

## ఇది మన హక్కు క్యాలెండర్ & డైరీ ఆవిష్కరించిన ఎమ్మార్వో శ్రీపాద ఈశ్వర్,ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్. శ్రీనివాస్





గోదావరిఖని ఆర్ సి:రామగుండంలో "ఇది మన హక్కు" సమాచార పత్రిక క్యాలెండర్ ఉ డైరీని రామగుండం ఎమ్మార్వో శ్రీపాద ఈశ్వర్, ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్. శ్రీనివాస్ ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారి కార్యాలయాల్లో క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో "ఇది మన హక్కు సమాచార పత్రిక" మేనేజింగ్ డైరెక్టర్ ఉ ఎడిటర్ వడ్లకొండ మహేందర్ గౌడ్?తో పాటు సభ్యులు,ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర నాయకులు,బైరిమల దుర్గాప్రసాద్,కంది విజయ గాంధీ, నల్గొండ సతీష్, అరుకల విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# వీర్ గాథ 5.0 'సూపర్ 100'లో ఎంపికైన శార్వాణి స్కూల్ విద్యార్థిని






చెన్నూర్.:దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక వీర్ గాథ 5.0 పోటీల్లో శార్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని తాండ్ర స్వరమంజు ప్రియ జాతీయ స్థాయిలో అరుదైన ఘనతను సాధించారు. భారత రక్షణ మంత్రిత్వ శాఖ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్లో భాగంగా ఈ పోటీలు నిర్వహించబడ్డాయి.దేశవ్యాప్తంగా మరియు విదేశాల్లోని అన్ని భారతీయ పాఠశాలల నుంచి లక్షలాది మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వారిలో దేశం మొత్తం మీద కేవలం 100 మంది మాత్రమే 'సూపర్ 100' విజేతలుగా ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కేవలం నాలుగు మంది విద్యార్థులు మాత్రమే ఈ ఘనతను సాధించగా, వారిలో ఒకరు శార్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్?కు చెందిన విద్యార్థినే కావడం గర్వకారణం.ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులో భాగంగా జనవరి 22న స్వరమంజు ప్రియ తన తల్లితో కలిసి విమానంలో న్యూఢిల్లీకి ప్రయాణించారు. అవార్డు విజేతకు మరియు ఆమె తల్లికి రెండు వైపుల విమాన ప్రయాణ ఖర్చులు, 5 స్టార్ హోటల్ వసతి పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించింది.ఆమెకు రూ.10,000 నగదు బహుమతి అందజేయడంతో పాటు, న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్ (రెడ్ ఫోర్ట్) వద్ద నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పరేడ్?లో ప్రత్యేక అతిథిగా పాల్గొనే అవకాశం లభించింది.ఈ గొప్ప విజయంలో విద్యార్థినికి నిరంతర మార్గనిర్దేశం, ప్రోత్సాహం అందించిన ఆమె ఇంగ్లీష్ ఉపాధ్యాయిని శ్రీమతి అనుష కుమ్రామ్ గారికి పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఆమె అంకితభావం, కృషి ఈ జాతీయ స్థాయి విజయానికి కీలకంగా నిలిచాయి.అలాగే, శార్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపాల్ శ్రీ మేడా శ్రావణ్ రెడ్డి గారి దూరదృష్టి, నాయకత్వం, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే విధానం వల్లే ఇలాంటి జాతీయ స్థాయి విజయాలు సాధ్యమవుతున్నాయని పాఠశాల వర్గాలు వెల్లడించాయి.ఈ విజయం ఒక విద్యార్థినిదే కాకుండా శార్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్, చెన్నూర్ మరియు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు నాగుల మహేష్, రజిత, చంద్రయ్య, లక్ష్మి నివాస్, రాకేశ్, సతీష్, మోర్ల మధూకర్, సుప్రియ, రమా దేవి, మనీషా, దీక్షిత,శ్రీకాంత్, రమేష్, శ్రావణి దామోదర్, శ్రిజన్, సాత్రిక, సుజాత, సమత, మరియు వీణ గార్లు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఇది శార్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ చరిత్రలో ఒక స్వర్ణాధ్యాయం.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికల) టీచర్ పేరెంట్స్ సమన్వయ సమావేశం

**విద్యా నైపుణ్యం తోనే విద్యార్థుల సమగ్ర అభివృద్ధి**







ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:నిర్మల్ జిల్లా పట్టణం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల( బాలికల) లో (జి జె సి) విద్యార్థినుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమన్వయ సమావేశం ప్రిన్సిపాల్ శ్రీమతి జూపిషన్ సుల్తానా అధ్యక్షతన (టిజిబిఐఈ )ప్రత్యేక అధికారి శ్రీ వెంకటేష్ మరియు జిల్లా జూనియర్ కళాశాల విద్యాధికారి డి ఐ ఈ ఓ శ్రీ పరుశురాం సమక్షంలో సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీమతి జుఫీషియల్ సుల్తానా మాట్లాడుతూ రోజువారి కళాశాల విద్య పురోగతి షెడ్యూల్ క్రమశిక్షణ మరియు సహ పాఠ్య కార్యకలాపాల ను ఉద్దేశించి విద్యార్థుల సమగ్ర అభివృద్ధి సంస్థ తీసుకుంటున్న నిరంతర ప్రయత్నాలను ఆమె వివరించారు విద్య నైపుణ్యాన్ని సాధించడంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమన్వయం యొక్క ప్రాముఖ్యతను తెలియపరిచారు మరియు తెలంగాణ ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ప్రస్తుతం సేవలందిస్తున్న కళాశాల పూర్వ విద్యార్థులను సన్మానించి వారి విజయాలను అభినందిస్తూ ప్రస్తుత విద్యార్థులకు పూర్వ విద్యార్థుల నైపుణ్యం వారి ఆదర్శాన్ని తెలియజేశారు.టీచర్స్ పేరెంట్స్ సమన్వయ సమావేశం( ఎంపీటీఎం) విజయవంతంగా నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో విద్యార్థినుల తల్లిదండ్రులు చురుగ్గా పాల్గొని జీజేసి విద్యార్థినిలు అందించిన విద్య ప్రమాణాలు సహాయక వాతావరణం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు తల్లిదండ్రులు లెక్చరర్ల కళాశాల పరిపాలన మధ్య పరస్పర చర్చలతో ఈ కార్యక్రమం సానుకూలంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినిలు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు

# చెన్నూర్ మున్సిపాలిటీకి స్వాగత తోరణం

**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద.**



చెన్నూర్/మంచిర్యాల,జనవరి 24 :చెన్నూర్ మున్సిపాలిటీ ప్రవేశ ప్రాంతం వద్ద స్వాగత తోరణం ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శనివారం జిల్లాలోని చెన్నూర్ మున్సిపల్ పరిధిలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ లతో కలిసి 50 లక్షల రూపాయల నగరాభివృద్ధి నిధులతో చేపట్టిన ఖమాన నిర్మాణం, 1 కోటి రూపాయల నగరాభివృద్ధి నిధులతో వివిధ వార్డులలో కల్వర్టుల నిర్మాణం, 50 లక్షల రూపాయలతో పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ పట్టణంలో దాదాపు 50 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, 50 లక్షల రూపాయలతో ఖమాన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూరు మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యార్థం స్మశాన వాటిక ఏర్పాటులో భాగంగా 1 ఎకరం విస్తీర్ణం గల భూమిని సేకరించి 1 కోటి 20 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో గల ప్రాంతాన్ని పార్క్ గా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, జిమ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కొరకు 1 కోటి రూపాయలతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజల అభీష్టం మేరకు చెన్నూర్ పట్టణంలో ఆర్ టి సి డిపో ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని, పట్టణ ప్రజల కొరకు చెన్నూర్ నుండి హైదరాబాద్ కు బస్సు నడిపించడం జరుగుతుందని, ఉదయం 5 గంటలకు బస్సు ఏర్పాటు ప్రతిపాదన పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2 కోట్ల రూపాయలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1 కోటి 50 లక్షల రూపాయలతో పనులు కొనసాగుతున్నాయని, 50 లక్షల రూపాయలతో ముదిరాజ్, 30 లక్షల రూపాయలతో మున్నూరు కాపు కమ్యూనిటీ హాల్ లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, 15 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో మెరుగు సంఘ భవనం ఏర్పాటుకు ప్రతిపాదనలు పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో ప్రజా ప్రయోజనార్థం అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజల త్రాగునీటి సమస్యను పరిష్కరించడంలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా 250 బోర్ వెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, అమృత్ పథకంలో భాగంగా 30 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పనులు 50 శాతం పూర్తయ్యాయని, పనులు వేగవంతం చేసి ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టి పనులు కొనసాగుతున్నాయని, చెన్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్ ద్వారా వీటిని వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతు భరోసాపై స్పష్టత ఏది..?

**ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రకటించాలి**
**టి ఆర్ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్**



ఎల్కతుర్తి జనవరి 24 :రైతు భరోసాపై స్పష్టత ఏది..? అని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తితే శనివారం ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన హింగే భాస్కర్ మీడియాతో టిఆర్ఆర్ఎస్ నేతలతో కలిసి మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు ప్రతి ఎకరాకు సంవత్సరానికి రూ. 15000 చొప్పున రైతు భరోసా అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు పథకం అమలుపై స్పష్టత ఇవ్వకపోవడం వల్ల రైతుల్లో అయోమయం నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా రూపొందించిన రైతు భరోసా పథకాన్ని క్రమబద్ధంగా పారదర్శకంగా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ప్రతి పంట కాలములో రైతులకు భరోసాగా నిలవాల్సిన ఈ పథకం విషయంలో స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్న విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల కంటే మెరుగైన పాలన రైతులకు మరింత మేలు జరుగుతుందన్న ఆశతో.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతుల ఆశలు, విశ్వాసాలు దెబ్బతినకుండా చూడాలంటే రైతు భరోసా పథకం అమలుపై తక్షణమే స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకం కింద ప్రతి సంవత్సరం ఏ తేదీ వరకు ఎంత మొత్తాన్ని ఏ విధంగా రైతులకు అందించనున్నారో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించి రైతులు అయోమయానికి గురికాకుండా చూడాలని రాష్ట్ర రైతులు వినయపూర్వకంగా బలంగా కోరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు రక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, అంబీర్ శ్రీనివాస్, కోదాటి మాధవరావు, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి



**ఎన్టీఆర్ జిల్లా జనవరి 24 :** ఏలూరు:విద్య కు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి పేర్కొన్నారు.ఏఐఎస్ఎఫ్ – 2026 నూతన క్యాలెండర్ ను కలెక్టర్ కార్యాలయంలో వెట్రి సెల్వి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి మాట్లాడుతూ నిరంతరం విద్యార్థులు సమస్యలు పరిష్కారం కోసం వారి హక్కులు కోసం పోరాటం చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏలూరు జిల్లా సమితి విద్యార్థి సంఘాన్ని జిల్లా కలెక్టర్ అభినందించారు.జిల్లా వ్యాప్తంగా నెలకొన్న విద్యార్థులు సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి నేరుగా తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి. శివ కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సిద్ధు,కృష్ణ, చంటి,మణికంత, తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని జిల్లా సాధన జేఏసీ పిలుపునిచ్చిన బంద్ కు వైస్సార్సీపీ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపిన నాయకులు





**ఆలూరు డివిజన్ :**హోళగుంద మండల కేంద్రం వాల్మీకి సర్కిల్ వద్ద ఆదోని జిల్లా గా ప్రకటించలని జేఏసీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి రోడ్డు మీద కూర్చుని నిరసన చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు యస్ కె గిరి కన్వీనర్ షాపి మాట్లాడుతూ ఆదోని రెండవ ముంబాయి గా పేరుంది జిల్లా చేస్త ఐదు నియోజకవర్గాల అభివృద్ధి అవుతాయి ప్రతి పనికి కర్నూలు వెళ్తారు అదే ఆదోని జిల్లా అయితే పరిపాలన ప్రజలకు అందుబాటులో ఉంటాయి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ఆదోని జిల్లా కోసం 65రోజుల నుంచి ప్రతి నియోజకవర్గంలో దీక్షలు కొనసాగుతున్నాయి ఆయన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు వెంటనే ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న ఈ కార్యక్రమంలో శేషప్ప ముద్దప్ప ఈరన్న ఇమ్రాన్ గదిలింగ కళింగ భాషా నాయకులు పాల్గొన్నారు

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.



**ఏలూరు, జనవరి 24.** స్థానిక జిల్లా కలెక్టరేటు ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్ల గోడౌన్ ను శనివారం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఈవియం గోడౌన్ వద్ద సిసి కెమేరాలతో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఈవియం యంత్రాలు బి.యులు, సియులు, వివిప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవియం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవియం గోడౌన్ కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటి కప్పుడు గౌడౌన్ ను క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామన్నారు.. అనంతరం పరిశీలన రిజిస్టరులో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంతకం చేశారు. ఈవియం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు.జిల్లా కలెక్టరు వెంట డిఆర్ ఓ వి. విశ్వేశ్వరరావు, జిల్లా కలెక్టరేటు సూపరింటెండెంటు కె.సి.హెచ్. చల్లన్నదొర,వివిధ పార్టీల ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

## తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి అభినందనల వెల్లువ.





**ఏలూరు, జనవరి 24**.ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జిల్లా పార్టీ అధ్యక్షులు బడేటి చంటిని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్చం అందించి అభినందించారు. అనంతరం వారిరువురూ కొద్దిసేపు అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై చర్చించుకున్నారు. ఇదేసమయంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, సంఘాల ప్రతినిధులు, అధికారులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలుసుకుని, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందించి అభినందించారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది.

## పీలేరులో నూతన పాలమిత్రాలకు రిఫ్రెష్మెంట్ ప్రోగ్రామ్



**పీలేరు,** జైకా సంస్థ సహకారంతో శ్రీజ డైరీ ఆధ్వర్యంలో పీలేరు ప్రాంతంలో నూతన పాలమిత్రాల కోసం రిఫ్రెష్మెంట్ మరియు అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీజ డైరీ పీలేరు ఏరియా ఆఫీసర్ శివకుమార్, పీఐబీ ఎగ్జిక్యూటివ్ కేశవ పాల్గొని పాలమిత్రాల బాధ్యతలు,స్వచ్ఛమైన మరియు నాణ్యమైన పాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్త లు వివరించారు. పాలు కొలిచే యంత్రాల నిర్వహణపై ముఖ్యమైన సూచనలు చేశారు.రాబోయే వేసవి కాలంలో పశు సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాలమిత్రాలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పీఐబీ ఎగ్జిక్యూటివ్ కేశవ మాట్లాడుతూ, ఎన్డీడీబీ సహకారంతో శ్రీజ సంస్థ ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్లో మెరిట్ సాధించిన పాల ఉత్పాదక కుటుం బాల పిల్లలకు రూ.20,000 స్కాలర్షిప్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం ఏరియా ఆఫీసర్ శివకుమార్ పాలమిత్రాలకు ఎగ్జిక్యూటివ్ బ్యాగ్, వాటర్ బాటిల్, 2026 డైరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్యారంపల్లి, కలకడ, గర్నిమిట్ట, గడి, పీలేరు ప్రాంతాలకు చెందిన నూతన పాలమిత్రాలు పాల్గొన్నారు. సూపర్?వైజర్లు నాగార్జున, మోహన్, రియాజ్, ప్రదీప్, మల్లికార్జున రెడ్డి కార్యక్రమాన్ని సమన్వయం చేసి విజయవంతం చేశారు.

# ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో 'నో టు డ్రగ్స్' వాక్‌థాన్ విజయవంతం

**ఎన్టీఆర్ జిల్లా జనవరి 24 :** జగయ్యపేట పట్టణంలోని ఈరోజు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య,సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో నిర్వహించిన 'నో టు డ్రగ్స్' వాక్‌థాన్ ఘనంగా జరిగింది.ఈ వాక్‌థాన్ వివేకానంద విగ్రహం, ఆర్టీసీబస్టాండ్ నుంచి చత్రపతి శివాజీ విగ్రహం, చిల్లకల్లు రోడ్ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డా. పోతినేని రమేష్ బాబు తన సందేశంలో డ్రగ్స్ వినియోగం వల్ల యువతలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడులు ఏర్పడతాయని, దీని ప్రభావం కుటుంబాలు మరియు సమాజంపై పడుతుందని అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా యువతకు అవగాహన కల్పించడం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత అవసరమని అన్నారు.జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య ) మాట్లాడుతూ, డ్రగ్స్ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని, డ్రగ్ రహిత సమాజం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు డ్రగ్స్ వల్ల సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని, ఇటువంటి అవగాహన










కార్యక్రమాలకు మున్సిపాలిటీ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.బీజేపీ అధికార ప్రతినిధినోముల రఘు మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగం యువతను తప్పుదారి పట్టిస్తున్నదని, ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిలవాలని సూచించారు.ఈ వాక్‌థాన్‌లో టీడీపీ సీనియర్ నాయకులు శ్రీరాం చిన్నబాబు ,జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్లు,ఎస్.వి.ఆర్ అమ్మాణి,వాగ్దేవి నర్సింగ్ మరియు డిగ్రీ కాలేజీ విద్యార్థులు,విశ్వ భారతి కాలేజీ విద్యార్థులు,లైఫ్ స్కిల్స్ వొకేషనల్ కాలేజీ విద్యార్థులు,డ్వాక్రా, మెప్మ సభ్యులు,ఈగల్ టీమ్,స్థానిక పోలీస్ సిబ్బంది సుమారు 1000 మందికి పైగా ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.పాల్గొన్న వారందరూ 'నో టు డ్రగ్స్' నినాదాలతో ర్యాలీ నిర్వహించి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా బలమైన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

# పరిటాల రవన్న ఈ నేల నిన్ను మరువదన్న21వ వర్ధంతి సందర్భంగా పరిటాల రవికి ఘన నివాళి

### ప్రముఖులు, అభిమానుల రాకతో జనసంద్రంగా మారిన వెంకటాపురం ఘాట్ వద్ద నివాళు లర్పించిన పరిటాల సునీత, శ్రీరామ్

**అనంతపురం :** పరిటాల రవి కల సాకారం కాబోతోందన్న సునీత, శ్రీరామ్ఊపిరి ఉన్నంత వరకు ఆయన ఆశయ సాధన కోసమే మా ప్రయాణమన్న సునీత, శ్రీరామ్ పీడిత ప్రజల పక్షాన నిలబడి.. పెత్తందారులు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించి... రాజకీయాల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న పరిటాల రవికి అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన నివాళి అర్పించారు. రామగిరి మండలం వెంకటాపురంలో మాజీ మంత్రి టిడిపి నాయకుడు పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి భారీగా తరలివచ్చిన అభిమానుల మధ్య సాగింది. ముందుగా తమ కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే సునీత శ్రీరామ్ పరిటాల ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆ తర్వాత వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ కుటుంబ సభ్యులతో కలసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షుడు పూల నాగరాజు, ఎడిసిసి బ్యాంక్ చైర్మన్







ముంటిమడుగు కేశవరెడ్డి, అనంతపురం జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఆలం నరసానాయుడు, రామలింగా రెడ్డి, గడ్డం సుబ్రహ్మణ్యం, బాంబే డయింగ్ నాగన్న ఇతర ముఖ్య నాయకులు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత, ధర్మవరం టిడిపి ఇన్ ఛార్జ్ శ్రీరామ్ మాట్లాడుతూ రవీంద్ర చనిపోయి 21సంవత్సరాలు గడుస్తున్నా.. అభిమానుల గుండెల్లో నేటికీ ఆయన చిరస్థాయిగా ఉన్నారన్నారు. ఆయన అభిమానులు ఎక్కడ ఉన్నా నేడు నివాళులర్పించడం చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ఒకప్పుడు పీడిత ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాల గురించి మాకు తెలియని ఎన్నో విషయాలు ఆయన సహచరులు, ఆరోజు ప్రత్యక్షంగా చూసినవారు నేటికీచెబుతుంటారన్నారు. ఎన్టీఆర్ ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చి... ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఈ ప్రాంతానికి ఎన్నో సేవలు అందించారన్నారు. పేరూరు ప్రాజెక్టుకు నీరు అందించాలన్నది ఆయన చిరకాల స్వప్నమని.. అయితే ఆ రోజు ఉన్న పరిస్థితుల్లో వీలు కాలేదన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిటాల రవీంద్ర కాలువ పేరుతో ఈ ప్రాజెక్టును ప్రారంభించినా ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. మళ్ళీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు మరోసారి నిధులు కేటాయించారని.. రేపటి రోజు ఆ పనులు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. పరిటాల రవి ఆశయ సాధన కోసం ఊపిరి ఉన్నంతవరకు తాము కృషి చేస్తామని సునీత, శ్రీరామ్ స్పష్టం చేశారు...

# లింగపాలెం మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**ఎన్టీఆర్ జిల్లా జనవరి 24 :** లింగపాలెం మండలంలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి చిత్రంలో మంత్రి కొలుసు పార్ధసారథి ఎంపీ మహేష్ యాదవ్ ఎమ్మెల్యేలు రోషన్ కుమార్ చింతమనేని మద్దిపాటితక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ లక్ష్యం ప్రజలకు రైతులకు పారిశ్రమ కరంగానికి తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్తును నిరంతరయంగా అందించడమే కూటమీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు ధర్మాజీగూడెంలో నిర్మించిన 132 కెవి విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్వయుక్త సహకారంతో ప్రతి నియోజకవర్గంలో పదివేల సూర్యఘర్ కనెక్షన్లు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు క్రెడిట్ లేని జగన్మోహన్ రెడ్డి చోరీల పై మాట్లాడటం హాస్యాస్పందమని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు రాష్ట్రంలో 2029 నాటికి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నామన్నారు ఏలూరు ఎంపీ పుటా మహేష్ కుమార్ మాట్లాడుతూ పొగాకు పండించే రైతులు ప్రత్యమయంగా పామాయిల్ సాగు చేసుకోవచ్చున్నారు ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ ధర్మాజీ గూడెంలో విద్యుత్



స్టెబిలైజేషన్ ప్రారంభించడంతో ఈ ప్రాంతంలో దీర్ఘకాలకంగా ఉన్న విద్యుత్ సమస్యలు తొలగిపోయాయన్నారు చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు నాలుగు నెలల్లో ప్రారంభిస్తామన్నారు మంత్రి నారా లోకేష్ జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మద్దిపాటి వెంకటరాజు మచ్చపట్ల ధర్మరాజు జడ్పీ చైర్మన్ గంట పద్మశ్రీ మాజీ ఎమ్మెల్యే గంటా మురళి రామకృష్ణ టిడిపి జోన్ 2 ఇన్చార్జ్



మందలపు రవి లింగపాలెం మండల అధ్యక్షులు గరిమెళ్ళ చలపతిరావు గుప్త సత్య వరప్రసాద్ మల్లికార్జునరావు ఏం వరప్రసాద్ సిహెచ్ రామ్మోహన్ రావు పి శ్రీనివాసరావు పి శ్రీను బుజ్జయ్య వెంకటేశ్వరరావు నాలుగు మండలాల కూటమి నాయకులు విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో చెత్త ఊడ్చి ఎత్తి వేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి చెత్తను తొలగించడంలో సహకరించిన శింగనమల మార్కెట్ యార్డ్ చైర్మన్ దండు శ్రీనివాసులు



**అనంతపురం :** అనంతపురం జిల్లా సింగనమల మండలంలోనిమదిరేపల్లిలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంఈ ఎమ్మెల్యే ఏ పని చేసినా సోషల్ మీడియాలో వైరల్ గా నిలుస్తుంది.ఈ ఎమ్మెల్యే చేపట్టే కార్యక్రమాలలో ఫోటోలకు ఫోజులు ఇచ్చి చేతులు దులుపుకోకుండా కచ్చితంగా పనిలోకి దిగిపోవడం ఆమె నైజం.కొంతమంది నాయకులు ఫోటోలకు ఫోజులు ఇచ్చి అంతా తామే చేశామని ఫోజులు ఇస్తుంటారని. కానీ శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఎపని చేసినా ఎ కార్యక్రమం చేసినా తూచ తప్పకుండా పనిలో నిమగ్నమవు తారన్నారు.గతంలో శింగనమల చెరువు ఆయకట్టు కింద వరినట్లు నాటడానికి వచ్చినప్పుడు ఏకంగా బురద మడిలోకి దిగి కూలీలతో పాటు గంట,రెండు గంటల పాటు వరి నాట్లు వేయడం జరిగింది. అంతేగాక వరి ఆయకట్టు రైతుల సమస్యలు అడిగి తెలుసు కోవడం జరిగింది.శింగనమల మండలం ఆకులేడు పంచాయతీ లోని మదిరేపల్లి గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఫోటోలకు ఫోజులివ్వకుండా సిబ్బంతితో కలిసి తానే స్వయంగా పంచాయితీ సిబ్బంది డ్రస్సు వేసుకుని చీపురు చేతబట్టి కసువును,



చెత్త,చెదారం ఊడుస్తూ వీధులను శుభ్రం చేస్తూ వుంటే శింగనమల మార్కెట్ యార్డ్ చైర్మన్ దండు శ్రీనివాసులు ఎమ్మెల్యే తో కలిసి పాల్గొని గ్రామ పరిశుభ్రత కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించారు. గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, కాలువల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆదివారం, జనవరి 25, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 10

## మహిళా విభాగ అధ్యక్షురాలు షేక్ మునీర జన్మదిన సందర్భంగా వారిని శాలువాతో సన్మానించి వారి చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేసిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు





**ఎన్టీఆర్ జిల్లా జనవరి 24 :** జగ్గయ్యపేట పట్టణంలోని ఈరోజు న నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు షేక్ మునీర జన్మదిన సందర్భంగా వారిని శాలువాతో సన్మానించి వారి చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేసిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హాఫిజున్నిసా, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, నియోజకవర్గ అంగనవాడి విభాగ అధ్యక్షురాలు ధరావత్ శ్యామల, పట్టణ కార్మిక విభాగ అధ్యక్షులు ఊస సురేష్, ఆవుల సాయి, ఆదిమాళ్ళ శివ, బండి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## ఏప్రిల్, మే నెలల్లో టీచర్లకు పదోన్నతులు,బదిలీలు

**శెట్టూరు మండలం జనవరి 24.:**ఉపాధ్యాయులకు ఏప్రిల్, మే నెలల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఉపాధ్యాయ సంఘాల నేతలతో నిర్వహించిన సమావేశంలో అధికారులు పలు అంశాలను వెల్లడించారు. హైస్కూల్ ప్లస్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, వేసవి సెలవుల్లో పని చేసిన టీచర్లకు ఆర్జిత సెలవులు ఇవ్వనున్నామని తెలిపారు. వీటికి సంబంధించిన ఉత్తర్వులు వారం రోజుల్లో ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రెగ్యులర్ ఖాళీలు భర్తీ అయ్యే వరకు క్లస్టర్ టీచర్స్ పాఠ శాలలు మారుతూ ఉండాల్సి ఉంటుందని, బదిలీల కౌన్సెలింగ్లో పాత పాయింట్లు పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో ఇక నుంచి ప్రతి వారం సమావేశాలు నిర్వహిస్తామని, జీతాల సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్ పదోన్నతులు ఎస్జీటీలకు 30:70 నిష్పత్తిలో చేపడతామని అధికారులు తెలపగా 70:30 నిష్పత్తి ప్రకారం కల్పించాలని సంఘాల నేతలు కోరారు.

## మొక్కలు నాటిన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు





**ఎన్టీఆర్ జిల్లా జనవరి 24 :** పెనుగంచిప్రోలు గ్రామంలోని ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ప్రాజెక్టు పెనుగంచిప్రోలుగ్రామంలో స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల పాఠశాల నందు ఈరోజు అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సీడీపీఓ సత్య వాణి ఆదేశాల మేరకు సూపర్ వైజర్ రజని ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలతో బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించి,ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నక్కా బాబురావు మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజంలో ఒక దురాచారమని, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు.పిల్లలతో ర్యాలీ చేయించి ,పిల్లలతో అన్ని రకాల పండ్ల మొక్కలు జామ,బొప్పాయి, దానిమ్మ, అరటి నిమ్మ,కరివేపాకు,మామిడి,మునగ చెట్లు నాటించటం జరిగింది. ఈకార్యక్రమం లో ముక్కా సత్యనారాయణ మాస్టారు, వేగినేటి వెంకటరమణ, స్వర్ణలత, త్రివేణి , లగడపాటి శ్రీదేవి మరియు సూపర్ వైజర్ రజిని అంగన్వాడీ వర్కర్స్ నాగమణి, సువర్చల,రాజ్యలక్ష్మి, సునీత,వాణి,మంజుల,విజయలక్ష్మి,సూర్యకుమారి,భవాని మరియు పిల్లలు పాల్గొనడం జరిగింది.

## కాలవ తోనే పట్టణ అభివృద్ధి బాబు



**రాయదుర్గం టౌన్ జనవరి 24.**BPS, LRS నిధులతో CC Road కు శంకుస్థాపన కు 10 వ వార్డు కనేకల్ రోడ్డు MR చాయ్ పక్కన CC Road 15.85 కు భూమి పూజ కార్యక్రమాన్ని వచ్చిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు గారిని ఆప్ జిల్లా కన్వీనర్ బి వెంకటరమణ బాబు వారి కార్యాలయంలో సన్మానించారు . ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ కాల్వ శ్రీనివాసులు ప్రత్యేక చొరవతో రాయదుర్గం పట్టణంలో కోట్ల నిధులతో సిసి రోడ్లు మొదలగు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతు న్నందు కు సంతోషంగా ఉందని ఎక్కడ క్వాలిటీ లో రాజీ లేకుండా పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గారికి సూచించారు.

## ఆల్ ఇన్ వన్ గైడ్ బుక్స్ పంపిణి కార్యక్రమం లో పాల్గొన్ని బుక్కులు పెన్నులు పంపిణీ చేసిన జెడ్పిటిసి సభ్యురాలు.వూట్ల నాగమణి







**ఎన్టీఆర్ జిల్లా జనవరి 24** పెనుగంచిప్రోలు మండలం, పెనుగంచిప్రోలు .ముండ్లపాడు,కొనకంచి . ముందుగా పెనుగంచిప్రోలు గ్రామంలోని. స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికలు ఉన్నత పాఠశాల లో స్కూల్ హెచ్ఎం బాబురావు ఉపాధ్యాయులు రమణ గారితో చర్చించారు అనంతరం విద్యార్థులకు బుక్స్ పెన్నులు పంపిణీ చేశారు మరియు. ముల్లపాడు కొనకంచి గ్రామాల్లో జిల్లా పరిషత్ హై స్కూల్స్ నందు ఆల్ ఇన్ వన్ గైడ్ బుక్స్ పంపిణి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని టెన్త్ విద్యార్థులకు బుక్స్ అందజేసిన జడ్పీటీసీ సభ్యులు వూట్ల నాగమణి..అనంతరం జడ్పీటీసీ వూట్ల నాగమణి ని శాలువాతో సత్కరించిన వినిపించుకోవడం మండల పరిధిలో స్కూల్ ఉపాధ్యాయులు జెడ్పిటిసి సభ్యురాలు వూట్ల నాగమణి ని సాల్వాతో సత్కరించి గౌరవం మర్యాదలు చేసినారు

# ప్రజాస్వామ్యానికి ఊపిరి ఓటు హక్కు సద్వినియోగం

### (25 జనవరి "జాతీయ ఓటర్ల దినోత్సవం" సందర్భంగా)

స్వతంత్ర భారతంలో తొలి సాధారణ ఎన్నికలు 1951-52లో నిర్వహించడంతో భారత ప్రజాస్వామ్య ప్రయాణం ప్రారంభం అయ్యింది. భారత రాజ్యాంగంలో అధికరణ 326 ప్రకారం 18 ఏండ్లు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించబడింది. గతంలో 21 ఏండ్ల వయస్సును 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 1988లోచేసిన చట్టం ప్రకారం 18 ఏండ్లకు కుదించబడింది. నియోజక వర్గ పౌరుడిగా రిజిస్టర్డ్ ఓటరు నమోదును పూర్తి చేసుకొని మానసిక ఆరోగ్యంతో ఉన్న 18 ఏండ్లు దాటిన పౌరులందరికీ ఓటు హక్కు అనివార్యంగా కల్పించబడుతుంది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్న భారత దేశంలో ఎన్నికలు సజావుగా జరగడం, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే సదవకాశాన్ని కల్పించడంతో మన దేశం ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తూ, మార్గనిర్దేశనం చేస్తుండడం హర్షదాయకం.

ఓటు వేయడం పౌరుల పరమ పవిత్రం బాధ్యత:

ప్రజాస్వామ్యానికి పునాది ఓటింగ్? ప్రక్రియ. పౌరులు తమ ఓటు హక్కును నిర్భయంగా, నిష్పక్షపాతంగా, దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వినియోగించుకోవడం ద్వారా తము మెచ్చిన నాయకులను ఎన్నుకోవడం, దేశ సమ్మిళిత అభివృద్ధిలో ప్రతి ఒక్కరు తమ పాత్రను నిర్వహించడం జరగాలి. ఓటు హక్కు సద్వినియోగం, యువ ఓటర్ల నమోదు, నిష్పాక్షికంగా విధిగా ఓటు వేయడం, ప్రభుత్వ ఏర్పాటులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావడం లాంటి లక్ష్యాలను అవగాహన పరచడానికి ప్రతి ఏట 25 జనవరి రోజున దేశవ్యాప్తంగా "జాతీయ ఓటర్ల దినోత్సవం" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. జాతీయ ఓటర్ల దినోత్సవం-2026 ఇతివృత్తంగా "నా ఓటు, నా భారత్? (మై ఓట్, మై ఇండియా)" అనే అంశాన్ని తీసుకొని విస్తృత ప్రచారం చేయడం జరుగుతున్నది. 25 జనవరి 1950న భారత ప్రభుత్వం "భారత ఎన్నికల కమీషన్(ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా, ఈసిఐ)"ని ఏర్పాటు చేసిన అంశానికి గుర్తుగా ప్రతి ఏట 25 జనవరిన జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించడం కొనసాగుతున్నది.

భారత ఎన్నికల కమీషన్ విస్తృత? ప్రచారాలు:

భారత దేశంలో నేడు "ఎన్నికలు ఎలక్ట్రానిక్? ఓటింగ్? మిషన్స్(ఈవిఎం)" లేదా బ్యాలెట్? పేపర్? పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. పట్టణ ఓటర్ల నిరాసక్తతను తట్టి లేపడం, ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించడం, ఎన్నికల్లో ప్రలోభాలకు అడ్డుకట్ట వేయడం, ధన ప్రవాహాన్ని అదుపు చేయడం, ఎన్నికల నేరాలను తీవ్రంగా తీసుకోవడం లాంటివి ఈసిఐ కనీస బాధ్యతగా తీసుకోబడుతున్నాయి. ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవడం, ఓటింగ్? శాతాన్ని పెంచడం లాంటి కార్యక్రమాల కోసం ఎపిక్? కార్డుల జారీ, ఓటరు ఐడీల వితరణ, ఈ-ఎపిక్?, స్వీప్?, ఓటరు అవగాహన, ఓటరు అవగాహన క్లబ్బుల ఏర్పాటు లాంటి చొరవను ఈసిఐ నిర్వహిస్తున్నది. ఓటు హక్కు ఒక పౌరసత్వం లాంటిది. ఓటు వేయని వారు దేశ పౌరుగానే భావించరాదు. ఓటు వేయని పౌరులకు ప్రశ్నించే హక్కు ఉండదని ప్రచారం చేయాలి. ఓటు హక్కు వినియోగించుకోవడం తప్పనిసరి ప్రతి ఒక్కరు భావించిన నాడు మాత్రమే అసలైన సుస్థిరాభివృద్ధిని కాంక్షించే ప్రజా ప్రభుత్వాలు ఏర్పడి, ప్రజలకు ప్రయోజనకర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగడం, ప్రభుత్వ నిధుల సద్వినియోగం, అక్రమాలకు అడ్డుకట్ట లాంటివి సుసాధ్యం అవుతాయని గమనించాలి. 18 ఏండ్లు నిండిన వెంటనే యువత మన ఓటరు నమోదు పూర్తి చేసుకొని, బాధ్యతగల ఓటరుగా ప్రవర్తించాలి. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు గొడుగు పట్టిన మహానుభావులను స్మరించుకోవడం, మన ఓటు మన స్వరం అని నినదించడం నిరంతరం జరగాలి. బాధ్యతగల ఓటరుగా గర్వపడుతూ, ఓటు హక్కు వినియోగంతో మనదైన ప్రభుత్వాన్ని ఏర్పరచుకొని దేశ సమగ్రాభివృద్ధికి గట్టి పునాదులు వేయాలని ఆశిద్దాం. భవ్య భారత సౌధానికి ఇటుకలు ఓటర్లని భావించి ఓటును సద్వినియోగం చేసుకుందాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# సమ్మిళిత సుస్థిరాభివృద్ధిలో పర్యాటక పాత్ర అద్వితీయం

### (25 జనవరి "జాతీయ పర్యాటక దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచ దేశాల్లో 5వ అతి పెద్ద పర్యాటక మార్కెట్? కలిగిన దేశంగా భారత్ నిలుస్తూ 2027 నాటికి 3వ అతి పెద్ద పరిశ్రమగా పర్యాటకాన్ని నిలపడానికి జోరుగా పథక రచనలు, అమలు జరుగుతుండడం హర్షదాయకం. భారత పర్యాటక రంగంలో సాంస్కృతిక, సాహస, పర్యావరణ లేదా ఎకో, వైద్య, వంట, క్రీడ, గ్రామీణ, ఆధ్యాత్మిక, వ్యాపార పర్యాటక విభాగాలు దేశ వైవిధ్యత, వారసత్వ సంపద, సమాజ అందాలను పర్యాటకులకుకనుల విందు చేస్తున్నాయి. దేశ ఆర్థికాభివృద్ధి, పర్యాటక కేంద్రాల అభివృద్ధి, స్థానిక ఆర్థిక పరిపుష్టి, ఉద్యోగ కల్పన, జిడీపీలో వృద్ధి, ప్రాంతీయ అభివృద్ధి, సాంస్కృతుల సంరక్షణ, విదేశీ మారక ద్రవ్యం, సాంస్కృతిక వినిమయం, మౌళిక వనరుల కల్పన లాంటి ప్రయోజనాలతో పర్యాటకం దేశ అభ్యున్నతికి తన వంతు బాధ్యతను నిర్వహిస్తున్నది. "ట్రావెల్? టూరిజం అభివృద్ధి సూచిక-2024" ప్రకారం 119 దేశాల జాబితాలో భారత్కు 39వ స్థానం కల్పించబడింది. ఇదే జాబితా లో 2021లో భారత దేశ స్థానం 54గా నమోదు అయ్యింది.

సమ్మిళిత సుస్థిరాభివృద్ధికి పర్యాటక పరిశ్రమ:

పర్యాట పరిశ్రమ ప్రాధాన్యాన్ని గుర్తించి ఆ రంగాన్ని దినదినం సమగ్రాభివృద్ధి చేయడం, దేశ ఆర్థికానికి ఊపిరులూదడం, సంస్కృతి వారసత్వ సంపదలను కాపాడడం, దేశ విదేశీ పర్యాటకులన ప్రోత్సహించడం లాంటి అంశాలను అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 25 జనవరి రోజుల "జాతీయ పర్యాటక దినోత్సవం" నిర్వహించడం జరుగుతున్నది. స్వతంత్ర భారతంలో "ఇంక్రెడిబుల్? ఇండియా లేదా అపురూప భారతం" అనే నినాదంతో పర్యాటక రంగానికి పెద్ద పూట వేయాలని భావించి 1948లో జాతీయ పర్యాటక దినం ప్రారంభించడం జరిగింది. జాతీయ పర్యాటక దినం-2026 ఇతివృత్తంగా "సమ్మిళిత, సుస్థిర, బాధ్యతాయుత అభివృద్ధిలో పర్యాటకం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. పర్యాటక పరిశ్రమ విస్తరణతో ఆయా ప్రాంతాల అన్ని వర్గాల ప్రజలు లాభపడడంతో సమ్మిళిత అభివృద్ధి సుసాధ్యం అవుతున్నది.

భారత్లో విస్తరిస్తున్న పర్యాటక పరిశ్రమ:

2019లో భారతంలో పర్యాటక ద్రవ్య వినియోగం 127 బిలియన్ డాలర్లు ఉండగా, 2023లో 174 బిలియన్? డాలర్లకు పెరిగింది. పర్యాటక పరిశ్రమతో దేశ ఆర్థికాభివృద్ధి ఎంతగానో జరుగుతున్నది. దేశ పర్యాటక పరిశ్రమ గత ఏడాది రూ:21 ట్రిలియన్లు జిడిపికి జమకాగా, 43 మిలియన్ల ఉద్యోగాలు కల్పించబడి, 2023-24లో 2.3 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభించడం విశేషంగా చెప్పుకోవాలి. భారత పర్యాటకం లో 65 శాతం వరకు తమిళనాడు, యూపీ, మహారాష్ట్ర, కర్నాటక, ఏపీ అనే ఐదు రాష్ట్రాలు మాత్రమే నమోదు చేసుకుంటున్నాయి.వైవిధ్యభరిత భారతంలో తాజ్మహల్, అజంతా ఎల్లోరా గుహలు, మహాబలిపురం, హంపీ, హవా మహల్?, ఆగ్రా ఫోర్ట్?, చార్మినార్? లాంటి ప్రధాన ప్రదేశాలతో పాటు పుష్కర ఫేర్లు, తాజ్? మహోత్సవ్, సూరజ్? కుండ్? మేళా, కుంభ మేళా లాంటివి కూడా విశేషంగా దేశ విదేశ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ప్రయాగ్? రాజ్?లో నిర్వహిస్తున్న 45 రోజుల మహా కుంభ మేళాకు దాదాపు 40 కోట్ల భక్తులు హాజరు అవుతారని అంచనా వేశారు. వీటికి తోడుగా అందమైన బీచ్?లు, హిల్? స్టేషన్స్?, అద్భుత వారసత్వ కట్టడాలు, సుందర సహజ ప్రకృతి కమనీయాలు, మనసును మెప్పించే బ్యాక్?వాటర్? అలలు, ఆధ్యాత్మిక కేంద్రాలు దేశ పర్యాటక పరిశ్రమకు పట్టుకొమ్మలుగా నిలుస్తున్నాయి.

భారత పర్యాటక మంత్రిత్వ శాఖ చొరవ:

భారత ప్రభుత్వం, పర్యాటక మంత్రిత్వ శాఖ నేతృత్వంలో పలు పర్యాటక ప్రోత్సాహక పథకాలను ప్రకటిస్తూ, ఆచరణలో పెట్టడంతో ఈ రంగం దినదినాభివృద్ధిని నమోదు చేసుకుంటున్నది. మౌళిక వసతుల కల్పన, సేవల విస్తరణ, దేశ విదేశీ పర్యాటకాలను ఆకర్షించడం లాంటి లక్ష్యాలను సుసాధ్యం చేయడానికి "ఇంక్రెడిబుల్ ఇండియా 2.0", "స్వదేశీ దర్శన్? పథకం", "దేఖో అప్నా దేశ్", "ప్రసాద్ స్కీమ్", "నిచే టూరిజం", "ఈ-వీసా సౌకర్యం", "జిఎస్?టి తగ్గింపు", "నిధిం డిజిటల్? పథకం" లాంటివి ఆచరణలో పెట్టబడినవి.ఆర్థికాభివృద్ధితో పాటు ఉద్యోగ కల్పన, స్థానిక ప్రదేశాల అభివృద్ధి, మౌళిక వసతుల పెంపు, లాంటివి పర్యాటక పరిశ్రమతో సుసాధ్యం కావడం వల్ల ఆ రంగాన్ని మరింత విస్తరించడానికి ప్రభుత్వాలతో పాటు సాధారణ పౌర సమాజం కూడా తమ వంతు కర్తవ్యాలను నిర్వహించి "మేరా భారత్? మహాన్" అంటూ నినదిద్దాం,భరతమాత సౌందర్యాన్ని ఇనుమడింపజేద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

## జగ్గయ్యపేటలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం: రోడ్లు ఊడ్చి, చెత్తను తొలగించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మరియు మున్సిపల్ చైర్మన్








**ఎన్టీఆర్ జిల్లా జనవరి 24 :** జగయ్యపేట పట్టణంలోని ఈరోజు నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా నేడు జగ్గయ్యపేట పట్టణ మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ ర్యాలీ మరియు పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ జగ్గయ్య పేట శాసనసభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మరియు మున్సిపల్ చైర్మన్ శ్రీరంగాపురం రాఘవేంద్ర , తెలుగునాడు అంగన్వాడి, డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మరియు చైర్మన్ స్వయంగా చీపుర్లు పట్టి మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో మరియు ప్రధాన రహదారుల్లో రోడ్లను ఊడ్చారు. పేరుకుపోయిన చెత్తను ఎత్తివేసి, పారిశుధ్య కార్మికులకు నైతిక మద్దతును అందించారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, చేతల్లో చూపించి ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.పట్టణ ప్రధాన రహదారుల గుండా నిర్వహించిన ర్యాలీలో ప్రజలకు పారిశుధ్యంపై ఈ క్రింది ముఖ్య అంశాలను వివరించారు:పరిశుభ్రతే ఆరోగ్యం: వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.చెత్త విభజన: తడి చెత్త మరియు పొడి చెత్తను వేరువేరుగా మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు.ప్లాస్టిక్ రహిత పట్టణం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, జగ్గయ్యపేటను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.సామాజిక బాధ్యత: స్వచ్ఛ ఆంధ్ర అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు ఇందులో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం, ఎమ్మెల్యే మరియు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు స్థానిక లి'అన్నా క్యాంటీన్'లిను సందర్శించారు. అక్కడ భోజన నాణ్యతను పరిశీలించి, అధికారులతో కలిసి అల్పాహారం సేవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ.. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రవేశపెట్టిన పథకాలు పేద ప్రజలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని కొనియాడారు. ముఖ్యంగా అన్నా క్యాంటీన్లు పేదవారి ఆకలి తీర్చడంలో అద్భుతమైన పాత్ర పోషిస్తు న్నాయని, రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ఇలాంటి సంక్షేమ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, నకిరకంటి వెంకట్, దువ్వల రామకృష్ణ, కాటగాని నరసింహారావు, నోముల రఘు, గింజుపల్లి కృష్ణ, మున్సిపల్ సిబ్బంది మరియు పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళల సాధికారతే సమాజాభివృద్ధికి మూలం..... నెట్టెం శ్రీ రఘురామ్, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)





**ఎన్టీఆర్ జిల్లా జనవరి 24**వత్సవాయి గ్రామంలో బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రం (బివివికే) వారి ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ , శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కలిసి రిబ్బన్ కటింగ్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో ఇటువంటి శిక్షణా కేంద్రాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కుట్టు మిషన్ శిక్షణద్వారా మహిళలు ఇంటి వద్దనే ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడగలరని అన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ మహిళల సాధికారతే సమాజాభి .వృద్ధికి మూలమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కళ్యాణం కోటేశ్వరరావు, చిరుమామిళ్ల హనుమంతరావు బొగ్గవరపు వెంకట రాజారావు, రాము, చంద్రశేఖర్,రమేష్, వై. రమణి ,చిట్టూరి జనార్ధన రావు మరియు వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు పాల్గొన్నారు.

# శాంసన్ స్థానాన్ని ఇషాన్ భర్తీ చేసే అవకాశం

భారత స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ దాదాపు 3 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జట్టులోకి తిరిగి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇషాన్ కిషన్ టీమిండియాలో భాగమయ్యాడు. మొదటి టీ20 మ్యాచ్‌లో విఫలమయ్యాడు, కానీ రెండవ టీ20లో అద్భుతమైన బ్యాటింగ్ చేశాడు. అతడి ఇన్నింగ్స్ సాధారణమని కొట్టిపారేయలేం. ఎందుకంటే ఇలాంటి ఇన్నింగ్స్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మీద ఒత్తిడి పెంచుతాయి. జట్టులో అసలుసిసలైన వికెట్ కీపర్ బ్యాటర్ కోసం టీమిండియా చాలా ఏళ్ల నుంచి వెతుకుతోంది. మరోవైపు వీరిద్దరూ టీ20 వరల్డ్ కప్ కోసం ఎంపికైన ఆటగాళ్లు. కనుక శాంసన్ విఫలం కావడంతో బీసీసీఐ వరల్డ్ కప్ లో ఇషాన్ కిషన్ కు ఛాన్స్ ఇవ్వనుందని ప్రచారం జరుగుతోంది. శుక్రవారం రాయ్‌పూర్‌లో జరిగిన సిరీస్‌లోని రెండవ టీ20లో ఇషాన్ కిషన్ కేవలం 32 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సర్ల సహాయంతో 76 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు, సంజూ శాంసన్ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లలోనూ విఫలమయ్యాడు. అతను 2 మ్యాచ్‌లలో వరుసగా 10, 06 పరుగులు చేశాడు. ఇషాన్ ఈ ఇన్నింగ్స్ 2026 టీ20 ప్రపంచ కప్ లో జట్టు ఈక్వేషన్‌ను మార్చే అవకాశం ఉంది. ఇంకా చెప్పాలంటే వికెట్ కీపర్ బ్యాటర్ స్థానానికి తుది జట్టులో రేసులో ఉన్నానని ఇషాన్ కిషన్ సంకేతాలు ఇచ్చాడు. మరోవైపు శాంసన్ వరుస మ్యాచ్ లలో విఫలమవుతూ ఏదో రోజు పెద్ద ఇన్నింగ్స్ ఆడతాడని విమర్శలు సైతం ఉన్నాయి. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ ఇద్దరూ టీ20 ప్రపంచ కప్ కోసం ఎంపికైన ఇండియా ఆటగాళ్లు అని తెలిసిందే. పొట్టి ప్రపంచ కప్ కంటే ముందు భారత్ ఆడే సిరీస్ న్యూజిలాండ్‌తో జరుగుతోంది. ఈ




టీ20 సిరీస్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లలో ఇషాన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. రెండవ టీ20లో ఇషాన్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఓపెనింగ్ చేసేందుకు శాంసన్‌కు గట్టి పోటీ ఇస్తున్నాడు. ఈ ఫామ్‌తో ఇషాన్ కిషన్ టీ20 ప్రపంచ కప్‌లో ఓపెనింగ్‌లో అభిషేక్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేయవచ్చు. లేదా శాంసన్ ను పక్కనపెట్టి ఇషాన్ కిషన్‌కు తుది జట్టులో అవకాశం వచ్చినా ఆశ్చర్యం అక్కర్లేదు. ఇషాన్ ఓపెనింగ్‌కు వస్తే, మిడిల్ ఆర్డర్‌లో శాంసన్‌కు చోటు కష్టం కావచ్చు. ఇషాన్ కిషన్ కూడా వికెట్ కీపర్, దీని కారణంగా సంజుకు సరైన ప్రత్యామ్నాయంగా మారవచ్చు. ఈ పరిస్థితిలో శాంసన్ ప్రతి మ్యాచ్‌లోనూ రాణించక తప్పదు. రాబోయే ప్రపంచ కప్‌లో మరోసారి సంజూకు అవకాశాలు సన్నగిల్లే ఛాన్స్ ఉంది.

# ఇషాన్, సూర్య విధ్వంసానికి పాకిస్థాన్ రికార్డ్ బ్రేక్




రాయ్‌పుర్ టీ20లో భారత్ బ్యాటర్లు సృష్టించిన విధ్వంసానికి పలు ప్రపంచ రికార్డులు బద్దలయ్యాయి. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ నిర్దేశించిన 209 పరుగుల భారీ టార్గెట్‌ను, టీమ్‌ఇండియా 3 వికెట్లు కోల్పోయి 15.2 ఓవర్లలోనే ఛేదించడం విశేషం. యువ సంచనలం, పాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ (76 పరుగులు, 237.50 స్ట్రైక్ రేట్) విధ్వంసాన్ని ప్రారంభించగా, కెప్టెన్ సూర్యకుమార్ (82 పరుగులు, 221.62 స్ట్రైక్ రేట్) కొనసాగించాడు. దీంతో భారత్ 28 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్ నెగ్గింది.తాజా మ్యాచ్‌లో సూర్య, ఇషాన్, శివమ్ దూబే చెలరేగడంతో గతంలో పాకిస్థాన్ నెలకొల్పిన ఓ రికార్డ్ బద్దలైంది. దీంతో ప్రపంచ టీ20 చరిత్రలో భారత్ అరుదైన రికార్డ్ నెలకొల్పింది. టీ20 మ్యాచ్‌లో 200ం ఛేదనలో అత్యధిక బంతులు మిగిలుండగా నెగ్గిన జట్టుగా టీమ్‌ఇండియా (ఫుల్ మెంబర్ స్క్వాడ్) సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ మ్యాచ్‌కు ముందు ఈ రికార్డ్ పాకిస్థాన్ పేరిట ఉండేది. 2025లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 205 పరుగుల టార్గెట్‌ను 24 బంతులు ఉండగా ఛేదించింది. తాజా మ్యాచ్‌తో పాక్ రికార్డ్‌ను భారత్ బ్రేక్ చేసింది.ఈ మ్యాచ్‌లో యంగ్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కూడా అరుదైన రికార్డ్ సృష్టించాడు. టీ20ల్లో న్యూజిలాండ్‌పై వేగవంతమైన అర్ధ సెంచరీ (21 బంతులు) సాధించిన భారత బ్యాటర్‌గా రికార్డ్ కొట్టాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఈ రికార్డ్ ఓపెనర్ అభిషేర్ పేరిట ఉండేది. అతడు ఈ సిరీస్‌లోనే తొలి మ్యాచ్‌లో 22 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకొని రికార్డ్ నెలకొల్పగా, తాజా మ్యాచ్‌తో ఇషాన్ అది బ్రేక్ చేశాడు. టీ20ల్లో దూకుడుకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండే కెప్టెన్ సూర్యకుమార్ కొన్ని నెలలుగా ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్నాడు. దీంతో అతడిపై తీవ్ర ఒత్తిడి పడింది. అయితే ఈ సిరీస్‌లో మునుపటి ఫామ్ అందుకున్నాడు. తొలి మ్యాచ్‌లో 32 పరుగులు చేసిన సూర్య, ఇప్పుడు 82లి పరుగులు సాధించాడు. ఈ క్రమంలో సరిగ్గా 487 రోజుల తర్వాత సూర్య టీ20ల్లో హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. ఈ గ్యాప్‌లో 23 ఇన్నింగ్స్‌లు ఆడాడు. అందులో ఒక్కసారి కూడా 50 పరుగుల మార్క్ అందుకోలేదు. దీంతో వరల్డ్‌కప్ ముందు సూర్య ఫామ్‌లోకి వచ్చేశాడని ఫ్యాన్స్ హ్యాపీగా ఫీల్ అవుతున్నారు.




# టీ20 ప్రపంచకప్పు నుంచి పాక్ తప్పుకుంటుందా..?

టీ-20 ప్రపంచకప్పు నుంచి బంగ్లాదేశ్‌ను తప్పిస్తూ ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) తప్పుబట్టింది. అందుకు నిరసనగా టోర్నీని బహిష్కరించాలని యోచిస్తోంది. ప్రపంచకప్పులో పాల్గొనడంపై తమ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ వెల్లడించారు. టోర్నీని బహిష్కరించాలా, లేదా పాల్గొనాలా అనే విషయాన్ని తమ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముందు ఉంచుతామన్నారు. ప్రస్తుతం ప్రధాని స్వదేశంలో లేరని, వచ్చాక ఆయన సలహా తీసుకుంటామన్నారు.ప్రభుత్వ నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని నఖ్వీ స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వద్దంటే అప్పుడు ఐసీసీ మరో జట్టును ఆహ్వానిస్తుందని విమర్శించారు. ప్రపంచ క్రికెట్‌లో బంగ్లాదేశ్ పెద్ద వాటాదారు అని, ఆ జట్టుకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఐసీసీ పక్షపాత నిర్ణయాలు తీసుకుందని నఖ్వీ ఆక్షేపించారు. పాకిస్థాన్, భారత్ కోసం వేదికలను మార్చి వారికి అనుకూలంగా వ్యవహరించినప్పుడు, బంగ్లాదేశ్ విషయంలో అలా ఎందుకు చేయలేదని నఖ్వీ ప్రశ్నించారు.

# స్మృతి మంధాన పెళ్లి రద్దుపై సంచలన ఆరోపణలు

టీమిండియా మహిళా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్ పెళ్లి రద్దు కావడం వెనుక అత్యంత దిగ్భ్రాంతికరమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంపై స్మృతి బాల్య మిత్రుడు విధాన మానే చేసిన సంచలన ఆరోపణలు ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. నవంబర్ 23, 2025న మహారాష్ట్రలోని సాంగ్లీలో స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్‌ల వివాహం ఘనంగా జరగాల్సి ఉంది. కానీ పెళ్లి రోజే ముహూర్తం ఆగిపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అప్పట్లో స్మృతి తండ్రికి ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రిలో చేరడం వల్లే పెళ్లి వాయిదా పడిందని భావించారు. కానీ అసలు కారణం అది కాదని, పలాష్ ముచ్చల్ మోసం చేయడమేనని ఇప్పుడు తేలింది. స్మృతి మంధాన చిన్ననాటి




స్నేహితుడు విధాన మానే ఓ ఇంటర్వ్యూలో పలాష్‌పై సంచలన ఆరోపణలు చేశారు. "పెళ్లి వేడుకలు జరుగుతున్న సమయంలో పలాష్ మరో మహిళతో కలిసి పడకగదిలో రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయాడు. ఆ దృశ్యాన్ని చూసి మేమంతా షాక్ అయ్యాం. ఆ సమయంలో అక్కడ ఉన్న భారత మహిళా క్రికెటర్లు ఆగ్రహంతో పలాష్‌ను చితకబాదారు" అని విధాన మానే వెల్లడించారు.కేవలం స్మృతిని మోసం చేయడమే కాకుండా, పలాష్ తన దగ్గర నుంచి కూడా భారీగా డబ్బులు వసూలు చేశాడని విధాన మానే ఆరోపించారు. ఒక సినిమా నిర్మిస్తానని చెప్పి పలాష్ తన దగ్గర రూ. 40 లక్షలు తీసుకున్నాడని, కానీ ఇప్పటివరకు సినిమా తీయలేదని, డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. పెళ్లి రద్దు అయినప్పటి నుంచి పలాష్ తన ఫోన్ కాల్స్ ఎత్తడం లేదని, అతను ఓ పెద్ద మోసగాడని విధాన మానే మండిపడ్డారు.స్మృతి మంధాన కుటుంబం ఈ ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. పలాష్ పెళ్లి చేసుకుని సాంగ్లీలోనే స్థిరపడతాడని తాము ఆశించామని, కానీ అతని అసలు స్వరూపం బయటపడటంతో స్మృతి తండ్రి మనస్తాపానికి గురై అనారోగ్యం పాలయ్యారని సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం స్మృతి ఈ చేదు జ్ఞాపకాల నుంచి కోలుకోవడానికి ప్రయత్నిస్తోంది.

# ఒకే మ్యాచ్‌లో 5 ప్రపంచ రికార్డులు గల్లంతు

రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లో టీమిండియా సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. న్యూజిలాండ్ నిర్దేశించిన 209 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా కేవలం 15.2 ఓవర్లలోనే ఊదేశింది. సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ బ్యాట్‌లతో విరుచుకుపడటంతో మైదానంలో పరుగుల వరద పారింది. ఈ మ్యాచ్‌లో గెలుపుతో పాటు ఏకంగా ఐదు భారీ రికార్డులు బద్దలయ్యాయి. కివీస్ బౌలర్లు చుక్కలు చూడగా, భారత బ్యాటర్లు చరిత్ర తిరగరాశారు. భారత యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో ఊచకోత కోశాడు. కేవలం 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి, టీ20ల్లో న్యూజిలాండ్‌పై అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన భారత ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. సరిగ్గా 48 గంటల క్రితమే అభిషేక్ శర్మ (22 బంతుల్లో 50) నెలకొల్పిన రికార్డును ఇషాన్ చెరిపేయడం విశేషం.సాధారణంగా పవర్ ప్లేలో ఓపెనర్లు మాత్రమే హాఫ్ సెంచరీలు సాధిస్తుంటారు. కానీ ఈ మ్యాచ్‌లో సంజు శాంసన్ త్వరగా అవుట్ కావడంతో వన్ డౌన్‌లో వచ్చిన ఇషాన్ కిషన్, పవర్ ప్లే ముగిసేలోపే తన యాభై పరుగులు పూర్తి చేశాడు. తద్వారా పవర్ ప్లేలో హాఫ్ సెంచరీ బాదిన తొలి నాన్ ఓపెనర్ భారత బ్యాటర్‌గా ఇషాన్ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో (ఫుల్ మెంబర్ జట్ల మధ్య) 200 కంటే ఎక్కువ పరుగుల లక్ష్యాన్ని అత్యంత వేగంగా ఛేదించిన జట్టుగా భారత్ నిలిచింది. 209 పరుగుల లక్ష్యాన్ని 28 బంతులు మిగిలి ఉండగానే టీమ్ ఇండియా పూర్తి చేసింది. గతంలో పాకిస్థాన్ (24 బంతులు మిగిలి ఉండగా 205 రన్స్ ఛేజ్) పేరిట ఉన్న రికార్డును భారత్ బద్దలు కొట్టింది.న్యూజిలాండ్ బౌలర్ జాక్ ఫౌల్క్స్ కు ఈ మ్యాచ్ ఒక పీడకల. కేవలం 3 ఓవర్లలోనే 67 పరుగులు సమర్పించుకున్నాడు. టీ20 క్రికెట్ చరిత్రలో ఒక కివీస్ బౌలర్ ఒకే మ్యాచ్‌లో ఇన్ని పరుగులు ఇవ్వడం ఇదే మొదటిసారి.

# మళ్లీ రెచ్చిపోయిన హార్దిక్..



టీమిండియా ఆటగాళ్లు మైదానంలో ఎంత దూకుడుగా ఉంటారో, కొన్నిసార్లు మైదానం బయట కూడా అంతే వేడిని ప్రదర్శిస్తుంటారు. తాజాగా రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20కి ముందు హార్దిక్ పాండ్యాకు సంబంధించిన ఒక వీడియో చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు హార్దిక్ ప్రాక్టీస్ కోసం మైదానంలోకి వస్తున్న సమయంలో, అక్కడ ఉన్న కామెంటేటర్ మురళీ కార్తీక్‌తో ఏదో విషయంలో వాగ్వాదానికి దిగాడు. మొదట సాధారణంగా మొదలైన వీరి సంభాషణ, కొద్దిసేపటికే సీరియస్ చర్చగా మారింది. హార్దిక్ ముఖ కవళికలు చూస్తుంటే అతను చాలా కోపంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.వైరల్ అవుతున్న వీడియోను గమనిస్తే.. హార్దిక్ మాట్లాడుతూ దూరం వెళ్లిపోవడం, మళ్ళీ వెనక్కి వచ్చి మురళీ కార్తీక్ దగ్గర నిలబడి గట్టిగా ఏదో చెప్పడం కనిపిస్తుంది. మురళీ కార్తీక్ కూడా తన వాదనను వినిపించడానికి ప్రయత్నించినప్పటికీ, హార్దిక్ ఏమాత్రం తగ్గలేదు. ఈ వీడియోను షేర్ చేసిన క్రికెట్ సెంట్రల్ అనే ఎక్స్ ఖాతా.. "రాయ్‌పూర్‌లో రెండో టీ20 ప్రారంభానికి ముందు హార్దిక్ పాండ్యా, మురళీ కార్తీక్ మధ్య పెద్ద గొడవ జరిగింది" అని పేర్కొంది. అయితే ఈ గొడవకు గల అసలు కారణం ఏమిటనేది మాత్రం ఇంకా అధికారికంగా తెలియలేదు. కేవలం అది సరదా చర్చా లేక నిజంగానే విభేదాలా అన్నదానిపై స్పష్టత లేదు. మరోవైపు న్యూజిలాండ్ సిరీస్‌లో హార్దిక్ పాండ్యా తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. నాగ్‌పూర్‌లో జరిగిన తొలి టీ20లో బ్యాట్‌తో 25 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో ఒక వికెట్ తీశాడు. ఇక రాయ్‌పూర్‌లో జరిగిన రెండో టీ20లో టీమ్ ఇండియా టాప్ ఆర్డర్ బ్యాటర్లు లక్ష్యాన్ని త్వరగా ముగించడంతో హార్దిక్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కానీ, బౌలింగ్‌లో ఒక కీలక వికెట్ పడగొట్టి తన వంతు సహకారం అందించాడు. ఈ గొడవ వీడియోపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు హార్దిక్ వైఖరిని తప్పుపడుతుంటే, మరికొందరు మురళీ కార్తీక్ ఏమైనా అనవసరమైన ప్రశ్నలు అడిగి ఉంటారా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా హార్దిక్ మైదానంలో తన సహచర ఆటగాళ్లపై, ప్రత్యర్థులపై కోపం ప్రదర్శించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఒక సీనియర్ మాజీ క్రికెటర్‌తో ఇలా వ్యవహరించడం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ వివాదంపై అటు హార్దిక్ కానీ, ఇటు మురళీ కార్తీక్ కానీ ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు.

# ఎప్రిల్ 10న స్వయంభు విడుదల

యంగ్ అండ్ డైనమిక్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోయే అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'స్వయంభూ' విడుదల తేదీని చింత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా విడుదలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది వేసవి కానుకగా, ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ పాన్-ఇండియా చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా కోసం నిఖిల్ పడుతున్న శ్రమ అంతా ఇంతా కాదు. ఒక యోధుడి పాత్రలో పరకాయ ప్రవేశం చేయడానికి ఆయన తన శరీరాకృతిని పూర్తిగా మార్చుకున్నారు. కేవలం ఫిజిక్ మాత్రమే కాకుండా, యుద్ధ సన్నివేశాల్లో సహజత్వం కోసం విదేశాల్లో కత్తిసాము, గుర్రపు స్వారీ ,విలువిద్యలో ప్రత్యేక శిక్షణ పొందారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో విజువల్స్ హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటాయని సమాచారం. అయితే తాజాగా నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లింప్స్ ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సినిమాపై అంచనాలను మరో మెట్టు ఎక్కించింది. ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న ఈ చారిత్రక గాథ తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.



# బాలకృష్ణ, గోపీచంద్ కాంబినేషన్‌లో 111వ సినిమా

**మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు ప్లాన్**



నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్ అంటేనే బాక్సాఫీస్ వద్ద మాస్ జాతర మొదలైనట్లే. 'వీరసింహా రెడ్డి' వంటి భారీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న 111వ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ విషయంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న సస్పెన్స్‌కు ఇప్పుడు తెరపడింది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను సుమారు రూ.170 కోట్ల భారీ బ్జడెట్‌తో ఒక చారిత్రక నేపథ్యం ఉన్న కథతో చేయాలనుకున్నారు. కానీ, ప్రస్తుతం మారిన మార్కెట్ పరిస్థితులు, బ్జడెట్ లెక్కల దృష్ట్యా ఆ కథను పక్కన పెట్టి, బాలయ్య ఇమేజ్‌కు సరిపోయే పక్కా మాస్ యాక్షన్ కథను గోపీచంద్ సిద్ధం చేశారు. ఇటీవలే దర్శకుడు వినిపించిన ఈ కొత్త కథకు బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, వచ్చే మార్చి నెల నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ 'వృద్ధి సినిమాస్' ధృవీకరించింది. తొలి షెడ్యూల్‌లోనే బాలయ్య మార్క్ అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ఇక హీరోయిన్ విషయానికి వస్తే, పాత కథ ప్రకారం నయనతారను ఎంపిక చేసినప్పటికీ, ఇప్పుడు కథ మారడంతో ఆమెనే కొనసాగిస్తారా లేక కొత్త హీరోయిన్‌ను తీసుకుంటారా అనే దానిపై సస్పెన్స్ నెలకొంది. ఏదేమైనా, బాలయ్య మార్క్ పవర్‌ఫుల్ డైలాగులు, గోపీచంద్ టేకింగ్ కలిసి మరోసారి బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# కొత్త చాప్టర్ ప్రారంభమైంది : సుస్మిత కొణిదెల

టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవి క్రేజ్ తార స్థాయిలో ఉంటుంది. ఆయన నుంచి సినిమా వస్తుందంటే చాలు... థియేటర్లు పండుగ వాతావరణంతో నిండిపోతాయి. అలాంటి అంచనాల మధ్య సంక్రాంతి కానుకగా విడుదలైన 'మన శంకర వరప్రసాద్ గారు' ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్‌గా మారింది.సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్లింది. ఫ్యామిలీ ఆడియెన్స్‌కు నచ్చే కామెడీ, మెగాస్టార్ మాస్ టైమింగ్, భావోద్వేగాలకు తగ్గ కథనం కలిసి సినిమాకు బలంగా నిలిచాయి. దీనికి తోడు విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించడం ప్రేక్షకులకు అదనపు ఆకర్షణగా మారింది.బాక్సాఫీస్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ప్రాంతీయ చిత్రాల చరిత్రలోనే అరుదైన రికార్డులను నమోదు చేస్తూ, సంక్రాంతి సీజన్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది.
ఇక ఈ ఘన విజయం నిర్మాతలకు కూడా కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ చిత్రాన్ని నిర్మించిన సుస్మిత కొణిదెల, తన నిర్మాణ సంస్థ 'గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్' కొత్త కార్యాలయాన్ని ప్రారంభించారు. 'న్యూ చాప్టర్ బిగిన్స్' అంటూ సోషల్ మీడియా ద్వారా ఆఫీస్ ఫోటోలు షేర్ చేస్తూ, భవిష్యత్తులో ఈ బ్యానర్ నుంచి మరిన్ని భారీ సినిమాలు రాబోతున్నాయని సంకేతాలు ఇచ్చారు. షైన్ స్క్రీన్‌తో కలిసి ఈ సినిమాను నిర్మించిన గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, తొలి ప్రయత్నంలోనే ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించింది.




# రాజాసాబ్ నుంచి సహనా సహనా వీడియో సాంగ్ విడుదల

సంక్రాంతి కానుకగా బాక్సాఫీసు ముందుకొచ్చిన చిత్రాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కించిన చిత్రమిది. ఇందులోని మెలొడీ 'సహనా సహనా' ఫుల్ వీడియో విడుదలైంది. ప్రభాస్- నిధి అగర్వాల్‌పై రూపొందించిన సాంగ్ ఇది. ఈ చిత్రం మంచి టాక్‌తో ప్రభాస్ మేనరిజాన్ని బాగా ఎలివేట్ చేసింది. మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినమా థియేటర్లలో ఆడుతోంది.

### 'కమిటీ కుర్రోళ్లు' తర్వాత నిహారిక కొత్త సినిమా..

# ఆకట్టుకుంటున్న 'రాకాస' గ్లింప్స్




'కమిటీ కుర్రోళ్లు' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత నిర్మాతగా నిహారిక కొణిదెల మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ముందుకు వస్తున్నారు. ఆమె నిర్మాణ సంస్థ 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై సంగీత్ శోభన్ హీరోగా 'రాకాస' అనే సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన గ్లింప్స్‌ను తాజాగా చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది.గ్లింప్స్ ప్రారంభంలో "ప్రతీ కథలో ఒక సమస్య, దాన్ని పరిష్కరించడానికి ఒక వీరుడు ఉంటాడు" అంటూ గంభీరమైన వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది. ఆ వీరుడు తనేనంటూ సంగీత్ శోభన్ ఎలివేషన్ ఇచ్చుకోవడం ఆసక్తి రేపుతుంది. అయితే, ఆ వెంటనే కథ సెటైరికల్, కామెడీ టర్న్ తీసుకోవడంతో గ్లింప్స్ సరదాగా సాగుతుంది. దీన్నిబట్టి సంగీత్ శోభన్ తనదైన కామెడీ టైమింగ్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించనున్నట్లు స్పష్టమవుతోంది.
మానస శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తుండగా, నిహారికతో కలిసి ఉమేశ్‌కుమార్ బన్సల్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ క్రేజీ ఎంటర్‌టైనర్‌ను ఏప్రిల్ 3న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.



# వివాదంలో 'బలగం' వేణు..!

'బలగం' వంటి సున్నితమైన, గుండెను తాకే చిత్రంతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న దర్శకుడు, నటుడు వేణు యెల్దండి ఇప్పుడు తన రెండో సినిమా 'ఎల్లమ్మ'తో ఫుల్ బిజీగా ఉన్నారు. తెలంగాణ సంస్కృతి, భక్తి భావాలను నేపథ్యంగా తీసుకుని రూపొందుతున్న ఈ పీరియాడిక్ డ్రామాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. దిల్ రాజు నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్‌ను 'పర్శి' అనే పవర్‌ఫుల్ మాస్ పాత్రలో పరిచయం చేయడం ఇప్పటికే పెద్ద సర్‌ప్రైజ్‌గా మారింది. ప్రస్తుతం సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది.ఇలాంటి సమయంలో 'ఎల్లమ్మ' షూటింగ్‌కు సంబంధించిన ఓ తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో దుమారం రేపుతోంది. వేణు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫొటోలు అనుకోకుండా వివాదానికి దారి తీశాయి. ఆ ఫొటోల్లో తెలంగాణలోని ఒక పురాతన ఆలయ ప్రాంగణంలో షూటింగ్ జరుగుతున్నట్లు కనిపించగా, అక్కడ వేణు షూస్ వేసుకుని ఉండటం నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది.పవిత్రమైన దేవాలయ ప్రాంగణంలో షూస్ ధరించడం హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్య అంటూ కొందరు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలంటూ సోషల్ మీడియాలో డిమాండ్లు మొదలయ్యాయి. దీంతో ఈ అంశంపై నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయారు.ఒక వర్గం మాత్రం వేణును సమర్థిస్తోంది. సినిమా షూటింగ్ సమయంలో భారీ లైటింగ్ సెటప్‌లు, ఎలక్ట్రికల్ వైర్లు, ఇతర సాంకేతిక పరికరాలు ఉండటంతో భద్రత కోసమే షూస్ వేసుకోవాల్సి వస్తుందని వారు వాదిస్తున్నారు. ఇది అవమానించే ఉద్దేశంతో చేసిన పని కాదని, పూర్తిగా సేఫ్టీ కారణాల వల్లే జరిగిందని చెబుతున్నారు.ఏదేమైనా, 'బలగం'తో అందరినీ ఒక్కటిగా చేసిన వేణు యెల్దండి, ఇప్పుడు 'ఎల్లమ్మ' షూటింగ్ ఫొటోల కారణంగా వివాదంలో చిక్కుకోవడం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.




# దురంధర్‌ను మించిన బోర్డర్-2

దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన 'బోర్డర్ 2' తొలిరోజు కలెక్షన్ల విషయంలో 'ధురంధర్' ను బీట్ చేసింది. శుక్రవారం విడుదలైన 'బోర్డర్ 2' అదే రోజు.. భారతీయ బాక్సాఫీసు వద్ద రూ.32 కోట్లు (నెట్) కలెక్షన్లు రాబట్టింది. 'ధురంధర్' తొలిరోజు కలెక్షన్లు రూ.28.60 కోట్లు మాత్రమే. సన్నీ దేవోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో అనురాగ్ సింగ్ 'బోర్డర్ 2'ను తెరకెక్కించారు. 1971 ఇండో - పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన 'బోర్డర్'కు కొనసాగింపుగా వచ్చింది. ఈ సీక్వెల్ 28 ఏళ్ల తర్వాత వచ్చినా ప్రేక్షకాదరణ పొందడం విశేషం. ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబరు 5న విడుదలైన ఈ సినిమా రూ.1300? కోట్లు రాబట్టింది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com